ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 26 మార్చి 2024





మొత్తం ఓటర్లు	17, 69, 225
పురుషులు	9,13,772
మహిళలు	8,55,262
ఇతరులు	191

డాక్టర్ పెమ్మసాని వర్సెస్ రోశయ్య..





రానున్న ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా ఎన్ఆర్ఐ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బరిలోకి దిగారు. వృత్తిరీత్యా అమెరికాలో ఉంటున్నప్పటికీ డాక్టర్ పెమ్మసాని పుట్టింది, చదివింది, పెరిగింది ఈ లోక్‌సభ స్థానం పరిధిలోనే. గుంటూరులోనే ఆయన విద్యనభ్యసించారు. అమెరికాలో స్థిరపడినప్పటికీ తెలుగుదేశం పార్టీకి ఎంతో కాలంగా ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తున్నారు. తొలిసారి రాజకీయ అరంగేట్రం చేసినప్పటికీ తన వాక్చాతుర్యంతో ఇప్పటికే ఆయన జనాదరణ పొందారు. ఆయనకు ప్రత్యర్థిగా వైసీపీ తరఫున పొన్నూరు సిట్టింగ్ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య బరిలోకి దిగారు. తొలుత వైసీపీ తరఫున రోశయ్య బావమరిది ఉమ్మారెడ్డి వెంకటరమణ బరిలోకి దిగి డాక్టర్ పెమ్మసాని స్పీడును చూసి తట్టుకోలేక రంగంలో నుంచి తప్పుకోవటంతో రోశయ్యను దించారు.

శాసనసభ నియోజకవర్గాలు

గుంటూరు లోక్‌సభ స్థానం పరిధిలో గుంటూ రు తూర్పు, గుంటూరు పశ్చిమ, పొన్నూరు, తెనాలి, మంగళ గిరి, తాడికొండ (ఎస్సీ), ప్రత్తిపాడు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.

నియోజకవర్గ ముఖచిత్రం

గుంటూరు.. ఘనకీర్తి

- రాజకీయాల్లో ఉద్ధండులను అందించిన గుంటూరు జిల్లా
- దేశానికి ఉత్తమ పార్లమెంటేరియన్‌ను అందించిన ఘనత ఈ నియోజకవర్గానిదే...
- సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కిన ఆచార్య ఎన్జీ రంగా
- కేంద్ర మంత్రిగా అనేక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన కొత్త రఘురామయ్య
- ఆసియాలోనే అతి పెద్ద మిర్చి మార్కెట్ యార్డు గుంటూరులో..

గుంటూరు విశిష్టత...

మిరప, పత్తి, పొగాకు, పసుపు ఎగుమతులకు గుంటూరు ప్రధాన కేంద్రంగా పేరొందింది. ఆసియాలో కెల్లా అతిపెద్ద మిర్చి మార్కెట్ యార్డు గుంటూరులోనే ఉంది. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రధాన రవాణా, విద్య, వైద్య, వాణిజ్య కేంద్రంగా కూడా విరాజిల్లుతోంది. స్వాతంత్ర్య సమర యోధులు పట్టాభి సీతారామయ్య, కొండా వెంకటప్పయ్య వంటి వారు జన్మించింది ఇక్కడే. భారత స్వాతంత్రోద్యమ సమయంలో 1889లో మహాత్మా గాంధీ వీరితో కలిసి ఇక్కడ ఒక సదస్సు నిర్వహించారు. దేశంలోనే పేరొందిన ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల 1885లో స్థాపించబడింది. భారతదేశంలోనే మొట్టమొదటగా పొగాకు పరిశోధన సంస్థ 1936లో ఇక్కడ ఏర్పాటైంది. ఉమ్మడి రాష్ట్రంలోనే పేరొందిన ప్రభుత్వ వైద్యశాల 1848లో స్థాపించబడింది. ఉండవల్లి గుహలు, మంగళగిరిలోని పానకాలస్వామి ఆలయం, పెదకాకానిలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయాలు ఈ ప్రాంతంలో పేరొందాయి. 150 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన పురాతన మున్సిపాలిటీగా గుంటూరు పేరొందింది. 1866లో 25వేల జనాభాతో ఏర్పాటై 1891లో థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీగా 1917లో ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిగా, 1952లో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా, 1960లో సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. 1994లో మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందింది. మొట్టమొదటగా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు 1995లో నిర్వహించగా మొదటి మేయర్‌గా టీడీపీ తరఫున డాక్టర్ కొల్లి శారద గెలుపొంది మంచి పేరు తెచ్చుకున్నారు.

ఇక్కడి నుంచి లోక్‌సభకు..

1952లో ఏర్పడిన గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి మొదటిసారి ఎస్వీఎల్ నరసింహం ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. ఆయన తర్వాత కొత్త రఘురామయ్య ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి వరుస విజయాలు సాధించారు. 1957 నుంచి 1977 వరకు వరుసగా జరిగిన ఐదు ఎన్నికల్లోనూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అంతకుమునుపు 1952లో తెనాలి లోక్‌సభ స్థానం నుంచి కూడా ఆయన గెలుపొందారు. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో రక్షణ, కార్మిక, పౌరసరఫరాల శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి మంత్రివర్గంలో పౌరసరఫరాలు, సాంకేతికశాఖ మంత్రిగా వ్యవహరించారు. ప్రధాని ఇందిరాగాంధీ మంత్రివర్గంలో న్యాయ, పెట్రోలియం, పార్లమెంటరీ వ్యవహారాలు, నౌక, రవాణా, పర్యాటక శాఖలను నిర్వహించారు.

గుంటూరు అనగానే మొట్టమొదట గుర్తుకు వచ్చేది మిర్చి.. ఆసియాలో కెల్లా అతిపెద్ద మిర్చి మార్కెట్ యార్డు గుంటూరులోనే ఉంది. అందుకే గుంటూరు ఘాటు అనే నానుడి ప్రజల్లో ఉంది. రాజకీయాల్లోనూ అదే తీరు ఇక్కడ కనపడుతుంది. ఎందరో ఉద్ధండులైన రాజ కీయ నేతలను అందించిన ఘనకీర్తి గుంటూ రుది. స్వాతంత్ర్య పోరాటం నుంచి, ఆ తర్వాత ఇక్కడ మహా మహులు నడయాడారు. నీతివం తమైన రాజకీయాన్ని పాటించిన ఆచార్య ఎన్జీ రంగా ఇక్కడి వారే. కేంద్ర మంత్రిగా అనేక శాఖలను నిర్వహించిన కొత్త రఘురా మయ్య ఆదర్శవంతమైన రాజకీయ నేతగా గుర్తింపు పొందారు. అంతే కాకుండా రాష్ట్రంలో ప్రధాన రవాణా, విద్య, వైద్య, వాణిజ్య కేంద్రంగా కూడా విరాజిల్లుతోంది. మిరప, పత్తి, పొగాకు, పసుపు ఎగుమ తులకు గుంటూరు ప్రధాన కేంద్రంగా పేరొందింది.

సంవత్సరం -	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	ఎస్వీఎల్ నరసింహం	ఇండిపెండెంట్	ఎన్జీ రంగా	కేఎల్‌పీ	17517
1957	కొత్త రఘురామయ్య	కాంగ్రెస్	ఎస్వీఎల్ నరసింహం	ఇండిపెండెంట్	58955
1962	కొత్త రఘురామయ్య	కాంగ్రెస్	ఎస్వీఎల్ నరసింహం	ఇండిపెండెంట్	99942
1967	కొత్త రఘురామయ్య	కాంగ్రెస్	ఎస్వీఎల్ రావు	ఇండిపెండెంట్	117032
1971	కె రఘురామయ్య	కాంగ్రెస్	జూపూడి యజ్ఞనారాయణ	బీజేఎస్	191018
1977	కె రఘురామయ్య	కాంగ్రెస్	కె సదాశివరావు	బీఎల్‌డీ	85529
1980	ఎన్జీ రంగా	కాంగ్రెస్	కె సదాశివరావు	జనతా ఎస్	157334
1984	ఎన్జీ రంగా	కాంగ్రెస్	మొవ్వ చంద్రశేఖరరావు	టీడీపీ	11894
1989	ఎన్జీ రంగా	కాంగ్రెస్	ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు	టీడీపీ	65013
1991	లాల్‌జాన్‌బాషా	టీడీపీ	ఎన్జీ రంగా	కాంగ్రెస్	14744
1996	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	ఎస్ఎం లాల్‌జాన్‌బాషా	టీడీపీ	57,347
1998	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	ఎస్ఎం లాల్‌జాన్‌బాషా	టీడీపీ	48,499
1999	యంపరాల వెంకటేశ్వరరావు	టీడీపీ	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	40330
2004	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	వైవీ రావు	టీడీపీ	129792
2009	రాయపాటి సాంబశివరావు	కాంగ్రెస్	మాదల రాజేంద్ర	టీడీపీ	39355
2014	గల్లా జయదేవ్	టీడీపీ	వల్లభనేని బాలశౌరి	వైసీపీ	69111
2019	గల్లా జయదేవ్	టీడీపీ	మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి	వైసీపీ	4205



రఘురామయ్య




ఎన్జీ రంగా



ఎస్వీఎల్ నరసింహం



లాల్‌జాన్‌బాషా



రాయపాటి


గుంటూరు, మార్చి25(ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ స్థానం అనగానే మొట్టమొదటగా గుర్తుకొచ్చేది ఆచార్య ఎన్జీ రంగానే అని చెప్పవచ్చు. లోక్‌సభ, రాజ్యసభలోనూ 60 ఏళ్ళ పాటు కొనసాగి రైతుల పక్షాన పోరాడిన ఆచార్య రంగాజీని దేశానికి అందించిన ఘనత గుంటూరు లోక్‌సభ నియోజకవర్గానిదే సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా ఆయన ఎక్కటం ద్వారా ఈ ఘనత వహించారు. ఆరు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైనప్పటికీ ఎలాంటి పదవులు చేపట్టకుండా ప్రతిష్ఠాత్మక, నీతివంతమైన రాజకీయాన్ని పాటించిన ఖ్యాతి ఆచార్య రంగాదే. రైతులకు ఆయన అందించిన సేవలకు గుర్తుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టింది. 1996లో ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీగా రూపాంతరం చెందిన ఈ విశ్వవిద్యాలయం భారతదేశంలోనే వ్యవసాయ విద్యలో అగ్రగామిగా నిలిచింది.

ఆచార్య ఎన్జీ రంగా..

1980, 84, 89లో జరిగిన ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆచార్య ఎన్జీ రంగా గెలుపొందారు. 1930 నుంచి 1991వరకు కొద్దికాలం తప్పితే నిరాఘాటంగా పార్లమెంట్‌లో 60 ఏళ్లు ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. 1952, 1965లలో జరిగిన కామన్‌వెల్త్ పార్లమెంట్ సభలకు, 1980లో ఐక్యరాజ్య సమితి సమావేశానికి భారత ప్రతినిధిగా హాజరయ్యారు. కురువృద్ధుడు, సీనియర్ పార్లమెంటేరియన్ ఆచార్య ఎన్జీ రంగాను ఓడించి చట్టసభలో అడుగు పెట్టే అవకాశం బాషాకు నందమూరి తారక రామారావు కల్పించారు. తెలుగుదేశం ఆవిర్భావం అనంతరం తొట్టతొలుతగా ఈ నియోజకవర్గం నుంచి లోక్‌సభలో అడుగుపెట్టే అవకాశం ముస్లిం సామాజికవర్గానికి చెందిన ఎస్ఎం లాల్ జాన్‌బాషాకు లభించింది. 1991లో ఆయన విజయం సాధించారు. రంగా ఎంతోమందిని ప్రజానాయకులుగా తీర్చిదిద్దారు. గౌతు లచ్చన్న, పాతూరి రాజగోపాలనాయుడు, జి.మునిరత్నం నాయుడు, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, యడ్లపాటి వెంకటరావు, కందుల ఓబులురెడ్డి, ప్రగడ కోటయ్య, సుంకర సత్యన్నారాయణ, గోగినేని నాగేశ్వరరావు తదితరులు రంగా శిష్యరికం నుంచి వచ్చిన వారే.

ఆ తరువాత..

తరువాత తరంలో సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా పేరొందిన రాయపాటి సాంబశివరావు 1996, 98,లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇక్కడ గెలుపొందారు. 1999లో టీడీపీ తరఫున ఈ నియోజకవర్గం నుంచి గెలిచే అవకాశం యంపరాల వెంకటేశ్వరరావు (వైవీ రావు)కు దక్కింది. ఆ తర్వాత మళ్లీ రెండు పర్యాయాలు 2004, 2009లో రాయపాటి గెలిచారు. 2014, 2019లో ఈ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొంది లోక్‌సభలో అడుగుపెట్టే అవకాశం పారిశ్రామికవేత్త గల్లా జయదేవ్‌కు దక్కింది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా వ్యవహరిస్తున్న జయదేవ్ తిరిగి పోటీచేసే అవకాశం ఉన్నప్పటికీ వ్యక్తిగత కారణాలతో రాజకీయాల నుంచి వైదొలిగారు.



వైవీరావు



జయదేవ్

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు	
కమ్మ	2,02,769
రెడ్డి	1,05,866
ముస్లిం	1,87,080
కాపు	2,07,552
మాదిగ	1,58,242
మాల	2,03,917
ఆర్యవైశ్య	81,375
యాదవ	1,05,117
వడ్డెర	30,485
గౌడ	40,252
రజక	43,340
ముదిరాజు	4,024
ఎరుకుల	16,852
నాయిబ్రాహ్మణ	4,787
యానాది	9,082
బ్రాహ్మణ	35, 854
వెలమలు	1,000
క్షత్రియ	3,000
క్రిస్టియన్లు	6,149
దూదేకుల	3,472
పద్మశాలి	56,672
మంగళి	15,398
కుమ్మరి	16,769
ఉప్పర	14,458
బోయలు	1453
సూర్యబలిజ	2,414
కృష్ణ బలిజ	2,457
పెరిక	1,343
మేదర	2,701
జంగం	500
లంబాడి	3,598
చెంచు	141
బుడబుక్కలు	500
ఇతరులు	32, 121

పునర్విభజనలో అనేక మార్పులు..

గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం 2007లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన మూలంగా అనేక మార్పులకు గురైంది. అంతకుమునుపు ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్న చిలకలూరిపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు శాసనసభ నియోజకవర్గాలు నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గంలోకి వెళ్ళిపోయాయి. గతంలో ఉన్న తెనాలి లోక్‌సభ నియోజకవర్గం రద్దయి దాని పరిధిలో ఉన్న తెనాలి, మంగళగిరి శాసనసభ నియోజకవర్గాలు గుంటూరు లోక్‌సభ స్థానం పరిధిలోకి వచ్చాయి. 2022లో జరిగిన జిల్లాల పునర్విభజనలో గుంటూరు లోక్‌సభ స్థానం ప్రత్యేక జిల్లాగా ఏర్పడింది. గుంటూరు జిల్లాగా కొనసాగుతున్న ఈ లోక్‌సభ స్థానంలో 18 మండలాలు ఉన్నాయి.

కోడ్ కాదని.. ఓట్ల వేట

- యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న వైసీపీ
- వలంటీర్లకు తాయిలాలు ఇచ్చి మరీ ప్రచారం
- సెల్‌ఫోన్లకు సీఎం జగన్ వాయిస్‌తో సందేశాలు
- ఏ పార్టీకి ఓటు వేస్తారంటూ సర్వే ముసుగులో ఆరాపై అనుమానాలు
- ప్రతిపక్షాలకే ఎన్నికల నిబంధనలు అన్నట్లుగా అధికారుల తీరు



గుంటూరు, మార్చి 25: ఎన్నికల కోడ్ వచ్చి వారం అవుతుంది.. అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తున్నా.. అధికారులు మారలేదు. ఎన్నికల నిబంధనలు ప్రతిపక్షాలకే అన్నట్లుగా అధికార యంత్రాంగం ఉందన్న విమర్శలు వస్తున్నాయి. వలంటీర్లతో ప్రచారాలు, సీఎం జగన్ ఫొటోల తొలగించకపోవడం, సీఎం వాయిస్‌తో ప్రజల సెల్‌ఫోన్లకు సందేశాలు.. ఇలా కోడ్ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులు వలంటీర్లతో ప్రచార కార్యక్రమాలు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే కార్యక్రమాలు షరామామూలుగానే నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి కార్యాలయంలో వలంటీర్లతో మూడు రోజులుగా సమావేశాలు నిర్వహించినా అధికారులు పట్టించుకోలేదు. పైగా వలంటీర్లతో గ్రామాల్లో కులాల వారీగా వివరాలు సేకరించాలని వలంటీర్లను ఆ అభ్యర్థి ప్రలోభాలకు గురి చేస్తున్నారని టీడీపీ నేతలు రుజువు చేసినా అధికారులు కనీసం పరిశీలన కూడా చేయలేదు. ఈ క్రమంలో తమపై దాడి చేశారని ఏకంగా ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులుతోపాటు కూటమి పార్టీల నాయకులు స్వయంగా ఎస్పీకి, ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసి, వలంటీర్లు ఉన్న ఫొటోలు, వీడియోలు అందించారు. సత్తెనపల్లిలో జగన్ స్టిక్కర్ ఉన్న చీరలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. కోడ్‌కు విరుద్ధంగా శుక్రవారం గుంటూరు మిర్చి యార్డులో గుంటూరు లోక్‌సభ వైసీపీ అభ్యర్థి కిలారు రోశయ్య, గుంటూరు తూర్పు అభ్యర్థి నూరి ఫాతిమా, ప్రత్తిపాడు అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌లు ఎన్నికల ప్రచారం చేశారు. మిర్చియార్డులో వైసీపీ అభ్యర్థులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు కట్టినా అధికారులు పట్టించుకోలేదు. ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. అయినా అధికారులు అడ్డు కోవడంలేదు. మరోవైపు వారం రోజులుగా సీఎం జగన్ వాయిస్‌తో 'మీ బిడ్డ ఎవరితోనూ పొత్తుపెట్టుకోడు.. నమ్ముకున్నది దేవుడిని, మంచి చేసిన ప్రజలని.. కుట్రలు, కుతంత్రాలతో జెండాలు జత కట్టడమే వారి అజెండా.. మీ ఇంటిలో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే తోడుగా ఉండండి..' అంటూ 29 సెకండ్ల నిడివితో 8038462583 నెంబర్‌తో వాయిస్ సందేశాలు ఓటర్లకు పంపుతున్నారు. 6302994851 నెంబర్‌తో నరసరావుపేట ఓటర్ల నుంచి ఎవరికి ఓటు వేస్తారు అంటూ ప్రశ్నలతో సర్వే చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా చెబితే ఎక్కడ ఓట్లు తొలగిస్తారోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఇటువంటి సర్వేలు నిబంధనలకు విరుద్ధం అయినా యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇక వలంటీర్లు యథేచ్ఛగా వైసీపీ నేతలతో అంటకాగుతున్నారు. వారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నా ఏమాత్రం లెక్క చేయడంలేదు. పైగా మరింత విస్తృతంగా ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ అధికారులు ఇటువంటి కోడ్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు కోరుతున్నారు.

శింగరకొండ.. దేదీప్యమానం

- వైభవంగా 69వ వార్షిక తిరునాళ్ల
- పోటెత్తిన భక్తజనం

అద్దంకి, మార్చి25: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి 69వ వార్షిక తిరునాళ్లతో సోమవారం శింగరకొండ క్షేత్రం విద్యుత్ వెలుగుల మధ్య దేదీప్యమానంగా మారింది. ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయంతో పాటు సామాజిక వర్గాల అన్నదాన సత్రాలను విద్యుత్ దీపాలు అలంకరించారు. మెట్ల మార్గానికి కూడా విద్యుత్ లైట్లు ఏర్పాటుచేశారు. గతంలో పెద్ద సంఖ్యలో విద్యుత్ ప్రభల ఏర్పాటు జరగగా, ఈ ఏడాది మాత్రం ఒకే ఒక్క విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అధికారుల హెచ్చరికల నేపథ్యంలో పలువురు విద్యుత్ ప్రభల ఏర్పాటును విరమించుకున్నారు. ఇక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం రాతి మండపం నిర్మాణ పనులు కూడా ఆలస్యం కావటం భక్తులను మరింత నిరుత్సాహానికి గురిచేసింది. రాతి మండపం నిర్మాణంలో ఉండటంతో బాలాలయంలో స్వామి దర్శనం ఏర్పాటుచేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీళ్ళ ప్యాకెట్‌లు భక్తులకు పంపిణీ చేశారు. అన్ని అన్నదాన సత్రాలతో పాటు శ్రీరామ జీవన సంఘం, విద్యుత్ భవన్‌ల వద్ద భక్తులకు సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. అద్దంకి, ఒంగోలు, పొదిలి, నర్సరావుపేట, వినుకొండ డిపోల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడిపారు. పోలీస్ లు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటుచేశారు. విద్యుత్ ప్రభ ఒక్కటే కావటంతో ముందస్తుగా అంచానా వేసుకున్న 750 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది కాకుండా సుమారు 600 మందికే పరిమితం చేశారు. గతం కంటే దేవాలయం పరిసర ప్రాంతాలలో పోలీస్ సిబ్బందిని ఎక్కువగా కేటాయించారు. నామ్ రోడ్డులో ట్రాఫిక్‌ను మేదరమెట్ల, చిలకలూరిపేట, నరసరావుపేట మీదుగా మళ్లించారు. అద్దంకి పట్టణంలో భవాని సెంటర్‌లో మాత్రం వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(మంగళవారం)

సహారీ (ఉదయం) 4.51 (బుధవారం)



విద్యుత్ వెలుగుల్లో శింగరకొండ

జాబ్ కార్నర్

బెల్‌లో సీనియర్ ఇంజనీర్లు

బెంగళూరులోని కేంద్ర ప్రభుత్వ సంస్థకు చెందిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బెల్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు: 33**

1. సీనియర్ ఇంజనీర్: **19 పోస్టులు**
2. డిప్యూటీ మేనేజర్: **10 పోస్టులు**
3. సీనియర్ మేనేజర్: **4 పోస్టులు**

అర్హత: ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్‌లో బీఈ/బీటెక్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31
వెబ్‌సైట్: https://edn.bhel.com/

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్ ఐఐఐటీలో పీజీ, పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ - ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ల్లో చేరేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(పీజీఈఈ) 2024 ద్వారా అడ్మిషన్ పొందవచ్చు.

విభాగాలు: ఎంటెక్(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ(సీఎస్ఐఎస్), కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ (సీఏఎస్ఈ) ప్రొడక్ట్ డిజైన్ అండ్ మేనేజ్‌మెంట్(పీడీఎం), ఎంఎస్ బై రీసెర్చ్(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), సివిల్ ఇంజనీరింగ్(సీఈ), బయోటెక్నాలజీ), పీహెచ్‌డీ(కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్(సీఎల్), కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్ (సీఎన్ఎస్), స్పేషియల్ ఇన్ఫర్మేటిక్స్(ఎస్ఐ), కాగ్నిటివ్ సైన్స్(సీఎస్), హ్యూమన్ సైన్సెస్ (హెచ్ఎస్).
దరఖాస్తు రుసుము: రూ.2,500
చివరి తేదీ: ఏప్రిల్ 1 **ప్రవేశ పరీక్ష:** మే 4
ఇంటర్వ్యూలు: ఎంఎస్ జూన్ 5, 6; పీహెచ్‌డీ జూన్ 7, 8
వెబ్‌సైట్: pgadmissions.iiit.ac.in/pgee/

సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(సోమవారం దిక్సూచి తరువాయి)

పిటీషనర్ల ముఖ్య వాదనలు

1. ముస్లిం శరణార్థులను అనుమతించకపోవడం, మత వివక్ష ప్రాతిపదికపై పౌరసత్వం ఇవ్వడం వంటి అంశాల ద్వారా ఈ పౌరసత్వ సవరణ చట్టం దేశ రాజ్యాంగ మౌలిక లక్షణాలైన సమానత్వం, లౌకికతత్వం వంటి ప్రాథమిక హక్కుల అంశాలను ఉల్లంఘిస్తోంది. అందువల్ల ఈ చట్ట సవరణ రాజ్యాంగ వ్యతిరేకం.

2. కేవలం పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చే శరణార్థులను మాత్రమే అనుమతించడం, ఇతర సరిహద్దు దేశాలైన మయన్మార్, నేపాల్, శ్రీలంక వంటి దేశాలకు ఈ చట్టాన్ని వర్తించకపోవడం వంటి ప్రాంతీయ వివక్ష కూడా ఈ చట్ట సవరణ ద్వారా ఏర్పడింది.

3. అతి సున్నిత, సాంస్కృతికపరంగా వైవిధ్యమైన తెగలు గల ఈశాన్య రాష్ట్రాలు సరిహద్దు ప్రాంతాల నుంచి ఇప్పటికీ అక్రమ వలస సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఇప్పుడు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన శరణార్థులకు పౌరసత్వం కల్పించడం ద్వారా ఈ ప్రాంత తెగల సంస్కృతికి ముప్పు ఏర్పడుతుంది. ఈ ప్రాంతంలో కొరతగా ఉన్న వనరులపైన ఒత్తిడి అధికమౌతుంది. అక్కడి ఆదివాసీల ప్రత్యేక హక్కులకు భంగం కలుగుతుంది. ప్రస్తుతం ఈ చట్టం 2024 మార్చి 12 నుంచి అమలులోకి వచ్చింది.

ఈ చట్టం ప్రకారం భారత సరిహద్దున గల మూడు ముస్లిం దేశాలైన పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన ఆరు ముస్లిమేతర మతాల (హిందూ, క్రిస్టియన్, సిక్కు, జైన, బౌద్ధ, పార్శీ) శరణార్థులకు(ఎవరైతే ఆ దేశాల్లో మత హింసకు గురై తమ దేశాన్ని వీడి భారత్‌కు శరణార్థులుగా వచ్చారో వారికి) ఎటువంటి వీసా, పాస్‌పోర్ట్ వంటి ధృవీకరణ పత్రాలు లేనప్పటికీ, కొన్ని గుర్తింపు పత్రాలు సమర్పించడం ద్వారా భారత పౌరసత్వం కల్పించనున్నారు.


ఈ విధంగా పౌరసత్వం పొందడానికి ఆ శరణార్థులు 2014 డిసెంబరు 14లోగా భారత్‌కు వచ్చి ఉండాలి. వారు కనీసం అయిదు సంవత్సరాలు లేదా అంతకన్నా ఎక్కువకాలంగా భారత్ నివసిస్తున్నట్లు ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది. వారు భారత రాజ్యాంగం గుర్తించిన షెడ్యూల్ 8లో గల భాషల్లో ఏదైనా ఒకటి మాట్లాడగలమని స్వయం ధృవీకరణ సమర్పించాలి. అంతేకాక తాము పౌరసత్వ చట్టం అనుమతిస్తున్న మూడు దేశాల్లో ఏదైనా ఒక దేశానికి చెందినవారిమని ధృవీకరించే ఆధారాలు అంటే ఆ దేశాలు జారీచేసిన జనన ధృవీకరణ, విద్యాసంస్థలు జారీచేసిన సర్టిఫికెట్లు, ఐడెంటిటీ కార్డులు, వీసా లేదా పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి, భూమిహక్కు లేదా కౌలుదారీ పత్రాలు వంటివి ఏవైనా అక్కడి ప్రభుత్వాలు జారీచేసిన పత్రాలను ఆధారంగా చూపవచ్చు. ఇవి తమ తల్లిదండ్రులు, తాతలకు, ముత్తాతలకు సంబంధించినవి ఏవైనా సరే ఆధారాలుగా చూపవచ్చు. వీటిద్వారా ఆ శరణార్థులు ఏ దేశానికి చెందినవారు, ఏ మతానికి చెందినవారు అనే అంశాలను ధృవీకరించవచ్చు.

అదే విధంగా ఆ శరణార్థులు భారతదేశానికి 2014 డిసెంబరు 14లోగా రావడం జరిగిందని నిరూపించడానికి ఈ చట్ట నిబంధనల ప్రకారం 20 రకాల డాక్యుమెంట్స్‌ను అనుమతించారు. అవి:

- ఫారిన్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్(ఎఫ్ఆర్ఆర్ఓ) ద్వారా పొందిన స్లిప్
- జనాభా లెక్కల అధికారులు అందించిన రశీదు
- ఆధార్‌కార్డు
- వ్యాలిడ్ వీసా
- డ్రైవింగ్ లైసెన్స్
- రేషన్‌కారు
- గవర్నమెంట్ లేదా కోర్టుల ద్వారా జారీ అయిన ఏదైనా పత్రాలు
- బ్యాంక్ పాస్‌బుక్
- పాన్‌కార్డు
- వివాహ లేదా జనన ధృవీకరణ పత్రాలు
- యుటిలిటీ బిల్లులు
- స్కూల్ సర్టిఫికెటు
- ఏదైనా స్థానికసంస్థకు ఎన్నికైన పదవిలోని వ్యక్తి లేదా రెవెన్యూ ఆఫీసర్ జారీ చేసిన ధృవపత్రాలు వంటి దాదాపు 20 రకాల పత్రాలను ఆధారాలుగా పరిగణిస్తారు.

సులభ నిబంధనలు

ఈ మినహాయింపులను సులభతరం చేయడానికి పౌరసత్వ సవరణ చట్టంలోని అనేక అంశాలను చాలావరకూ కుదించారు. ఉదాహరణకు భారతదేశ పౌరసత్వాన్ని విదేశీయులు నేచురలైజేషన్ విధానం ద్వారా పొందాలనుకున్నప్పుడు వారు కనీసం 14 సంవత్సరాలపాటు దేశంలో నివసిస్తున్నవారై ఉండాలనే నిబంధనను ఈ చట్ట సవరణ ద్వారా అయిదు సంవత్సరాలకు కుదించారు.



అదేవిధంగా భారతీయ భాషల్లో వారికి ఒక్కటైనా వచ్చని నిర్ధారించే విద్యాసంస్థలు జారీచేసిన సర్టిఫికెట్ స్థానంలో స్వయం ధృవీకరణ సమర్పిస్తే సరిపోతుంది.

ఎటువంటి వాలిడ్ వీసా, లాంగ్‌టర్మ్ వీసాలు లేనప్పటికీ వాటి గడువు దాటిపోయినా వీరికి ఎటువంటి అడ్డంకులూ ఉండవు. కేవలం తమ జాతీయత, మతం, భారతదేశంలోకి నిర్ధారిత కటాఫ్ సమయం కంటే ముందే వచ్చామని నిరూపించుకుంటే సరిపోతుంది. అలాగే ఈశాన్య రాష్ట్రాల ప్రాంతాల్లోకి ప్రవేశించడానికి, సంచరించడానికి అవసరమైన లైన్ పర్మిట్ విధానం ఈ శరణార్థుకు వర్తించదు.

ఈవిధంగా అనేక మినహాయింపులు పొందడం ద్వారా అనేకమంది శరణార్థులు భద్రమైన జీవనం గడపడానికి ఏళ్లతరబడి చూస్తున్న ఎదురుచూపులకు తెరపడనుంది. ఈ పౌరసత్వ దరఖాస్తుదారులు స్థానిక అధికారుల, నాయకుల వ్యతిరేకతకు దోపిడీకి గురవకుండా ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే తమ దరఖాస్తులు సమర్పించే వెసులుబాటు తీసుకువచ్చారు. ఈ దరఖాస్తులను పరిశీలించడానికి కేంద్రప్రభుత్వం జిల్లాస్థాయిలో సాధికార డిస్ట్రిక్ లెవల్ కమిటీ(డీఎల్‌సీ)లను ఏర్పాటుచేసింది. దరఖాస్తులను ఈ కమిటీ ప్రాసెస్ చేయగా, పౌరసత్వం అందించే అధికారం ఒక ఎంపవర్డ్ కమిటీకి ఉంటుంది. ఈ కమిటీలో సెన్సెస్ డిపార్ట్‌మెంట్, హోంమంత్రిత్వశాఖ, పోస్ట్‌మాస్టర్ జనరల్, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్లకు చెందిన స్టేట్ ఇన్ఫర్మాటిక్స్ ఆఫీసర్స్ వంటి శాఖలకు సంబంధించిన ప్రతినిధులను ఉంటారు. రైల్వేస్ నుంచి రాష్ట్ర హోంశాఖల నుంచి ప్రత్యేక ఆహ్వానితులు ఈ కమిటీ ఉంటారు. ఈ కమిటీకి సెన్సెస్ విభాగానికి చెందిన అధికారి డైరెక్టర్‌గా ఉంటారు.

అదేవిధంగా డీఎల్‌సీల్లో ఆ జిల్లాలకు చెందిన డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లేదా వారి ప్రతినిధి, కేంద్రప్రభుత్వం నామినేట్ చేసిన అధికారులు ఉంటారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ ప్రతినిధిగా తహసిల్దార్ హోదాకు తగ్గని వ్యక్తి, రైల్వేశాఖ ప్రతినిధిగా జ్యూరిస్‌డిక్షనల్ స్టేషన్ మాస్టర్ ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు.

ఈవిధంగా డీఎల్‌సీల ద్వారా దరఖాస్తులు పరిశీలించి, ఎంపవర్డ్ కమిటీ ద్వారా పౌరసత్వం జారీ చేస్తుంది. అయితే కొన్ని మతాల వారిని మాత్రమే శరణార్థులుగా గుర్తించి, అదీ కొన్ని దేశాలకు చెందినవారికి మాత్రమే పౌరసత్వం ఇచ్చి ఆదుకొనే ప్రయత్నం చేయడం విపక్షాపూరితంగా ఉందన్నది ప్రధాన విమర్శ. ఆ కారణం తోనే కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు ఈ చట్టాన్ని అమలుచేయబోమని పేర్కొంటున్నాయి. ఈ రాష్ట్రాలకు తోడు ముస్లిం మతసంస్థలు, ఇతరత్రా సంఘాలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కూడా చర్చను లేవదీశాయి.

ప్రభుత్వ వాదన

అయితే ప్రభుత్వం మాత్రం తాము కొత్తగా వివక్ష చూపడం అంటూ ఏమీ లేదని అంటోంది. గతంలో 2004 నుంచి అమలులో ఉన్న ప్రభుత్వ ఆదేశాలకు ఒక నిర్దిష్ట చట్టరూపం తెచ్చామని వాదిస్తోంది. అదీకాక చుట్టుపక్కల మూడు ముస్లిం దేశాల్లో మతహింసకు గురవుతున్న అక్కడి మైనారిటీ వర్గాల శరణార్థులకు ఆశ్రయం కల్పించడం మత ప్రాతిపదికన వివక్ష చూపడం కాదని, ఆ దేశాల్లో మెజారిటీలుగా ఉన్న ముస్లింలకు మన దేశ పౌరసత్వం కల్పించాల్సిన అవసరం లేదన్నది కేంద్రప్రభుత్వ వాదన. అదేవిధంగా ఇతర దేశాలు, మతాలకు చెందిన శరణార్థులకు వారు అక్కడ మెజారిటీ మతాలకు చెందిన వారైనప్పటికీ శరణార్థులుగా వచ్చిన సందర్భాల్లో లాంగ్‌టర్మ్ వీసా(ఎల్‌టీవీ)లు కల్పించి వారిని సైతం ఆదుకోవడం జరుగుతోందని తెలిపింది. పరిస్థితులు చక్కబడిన వెంటనే ఆ మెజారిటీ వర్గాల వారు తిరిగి వెళ్లిపోవడానికి ఆసక్తి చూపుతారని, అందువల్ల వారికి శాశ్వత భారత పౌరసత్వం కల్పించనవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది.

అంతేకాకుండా ఉప తెగల మధ్య పోరు కారణంగా ముస్లిం దేశాల నుంచి కొందరు ముస్లింలు శరణార్థులుగా వస్తుంటారని పేర్కొంది. అంతర్గతంగా జరిగే కుమ్ములాటల తో దేశం విడిచివచ్చే వారికి ఈ చట్టాన్ని వర్తింపచేయలేమని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇస్తోంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/vE7iQ7b**లో చదవండి.**

అద్భుత కలయిక... ఇంకోసారి!



రామ్‌చరణ్ కెరీర్‌లో కలకాలం గుర్తుండిపోయే చిత్రం 'రంగస్థలం'. అంతవరకూ కమర్షియల్ క్యారెక్టర్స్ చేస్తూ అల్ట్రామోడరన్ హీరోగా గుర్తింపు పొందిన రామ్‌చరణ్‌తో పక్కా పల్లెటూరి యువకుడు చిట్టిబాబు పాత్ర చేయించి, సాహసం చేశారు దర్శకుడు సుకుమార్. అభిమానులు ఉప్పొంగే విధంగా, ప్రేక్షకులు మెచ్చుకొనే రీతిలో ఆ చిత్రంలో నటించి 'రంగస్థలం' అద్భుత విజయానికి కారణమయ్యారు రామ్‌చరణ్. ఇక అప్పటినుంచి వీరిద్దరి కాంబినేషన్‌లో మరో చిత్రం ఎప్పుడెప్పుడా అని ఆశగా ఎదురు చూస్తున్న ప్రేక్షక అభిమానులకు సోమవారం ఓ గుడ్ న్యూస్ చెప్పారు మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్. సుకుమార్ రైటింగ్స్ సంస్థతో కలసి రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం తీయనున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాదిలోనే షూటింగ్ ప్రారంభించి, 2025 చివరిలో విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తారని తెలిపారు. ఈసారి కూడా రామ్‌చరణ్ కోసం అత్యద్భుతమైన స్క్రిప్ట్‌ను సుకుమార్ తయారు చేశారని నిర్మాతలు చెప్పారు.

ఇండియన్ 3 కూడా ఉంటుంది



భారతీయ సినీ రంగంలో విశిష్ట నటుల్లో కమల్ హాసన్ ఒకరు. లోకనాయకుడిగా, వెర్సటైల్ జీనియస్‌గా అభిమానుల నుంచి కితాబులందుకునే కమల్, తన మల్టీ టాలెంట్‌తో సినీ ప్రియుల్ని ఎప్పటికప్పుడు అలరిస్తుంటారు. తాజాగా శ్రుతీ హాసన్, డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ నటించిన 'ఇనిమెల్' సాంగ్‌కు లిరిక్స్ అందించారు. ఇటీవలే, ఓ మీడియా ఇంటర్వ్యూలో తను నటిస్తున్న సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

నేను ఎన్ని పనులు చేసినా నా ఫస్ట్ లవ్ సినిమానే. 'విక్రమ్' రిలీజ్ అయ్యి రెండేళ్లు దాటినా, ఇంతవరకూ నా నుంచి మరో సినిమా రాలేదని అభిమానులు ఆశతో ఎదురుచూస్తున్నారు. కొంచెం ఆలస్యమైనా, నా ప్రాజెక్టులు ఒక్కొక్కటి థియేటర్లలో పలకరించడానికి సిద్ధమవుతున్నాయి. నేను టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఇండియన్-2 (భారతీయుడు-2) షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఆ తర్వాత వెంటనే ఇండియన్-3 పనులు మొదలవుతాయి. ఈ చిత్రంలో నేను పోషించే సేనాపతి (సినిమాలో కమల్ పాత్ర)లుక్‌కు మేకప్ వేయడానికి నాలుగ్గంటలు, తీయడానికి మరో రెండుగంటలు పట్టేది. పార్ట్-2లో మొదటి భాగంలోలాగే రెండు పాత్రల్లో కనిపిస్తాను. మే 9న రిలీజ్ అయ్యే 'కల్కి 2898 ఏ.డీ'లో ఓ అతిథి పాత్రలో నటించాను. అత్యాధునిక సాంకేతికతతో తెరకెక్కుతున్న ఈ చిత్రం భారతీయులు గర్వించే విధంగా ఉంటుంది. ఎలక్షన్లు ముగిశాక మణిరత్నం దర్శకత్వంలో నటిస్తున్న 'థగ్ లైఫ్' షూటింగ్‌లో పాల్గొంటాను. అలాగే ధనుశ్ నటిస్తున్న ఇళయరాజా బయోపిక్‌కు స్క్రీన్‌ప్లే అందిస్తున్నాను. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించే ఈ సినిమాలో నేను నా నిజ జీవిత పాత్ర పోషించడం ఎంతో ఆనందంగా ఉంది" అని చెప్పారు.



హోలీ అంటే భయపడేవాణ్ణి

విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం నుంచి థర్డ్ సింగిల్ 'మధురం కదా' విడుదలైంది. సోమవారం హోలీ వేడుకల్లో గ్రాండ్‌గా జరిగిన కార్యక్రమంలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్, నిర్మాత దిల్‌రాజు పాల్గొన్నారు. మూవీ టీమ్‌తో హోలీ ఆడుతూ కలసి డాన్సులు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'తన కుటుంబాన్ని గొప్ప స్థాయిలో నిలబెట్టేందుకు కష్టపడే ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ స్టారే. ఈ కథ మొదట విజయ్ విన్నాడు. నాకు ఫోన్ చేసి పరశురామ్ మంచి కథ చెప్పాడు. మీరు వింటారా? అని అడిగారు. నేను ఆ కథ విని 15 నిముషాల్లో ఓకే చెప్పేశాను. ఎందుకంటే ఇది మిడిల్ క్లాస్ కథ. మిమ్మల్ని మీరు చూసుకుంటున్నట్లుగా సినిమా ఉంటుంది. ఏప్రిల్ 5న ఫ్యామిలీస్ సినిమా చూడడానికి రండి' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'చదువుకొనే రోజుల్లో హోలీ అంటే రంగులు పూస్తారని, అవి అలాగే ఉంటాయనీ భయపడేవాణ్ణి. అదే టైమ్‌లో ఎగ్జామ్స్ జరుగుతుంటే చాలా మంది ముఖాల నిండా రంగులతో వచ్చే వారు. కానీ ఇప్పుడు ఇక్కడ మీ అందరితో కలసి హోలి సెలబ్రేట్ చేసుకుంటుంటే పండగంటే ఇలాగే ఉండాలనిపిస్తోంది. మనలాంటి ఫ్యామిలీస్ నుంచి వచ్చిన ఒక వ్యక్తి కథ మా సినిమా. మీరు బాగా ఎంజాయ్ చేస్తారు' అన్నారు. 'ఎప్పుడూ హోలీ పండుగను ముంబైలో చేసుకుంటూ ఉంటాను. ఈసారి మీ మధ్య 'ఫ్యామిలీ స్టార్' టీమ్‌తో కలసి సెలబ్రేట్ చేసుకోవడం ఆనందంగా ఉంది' అని మృణాల్ ఠాకూర్ అన్నారు.



ముచ్చటగా మూడోసారి!

నాని హీరోగా 'జెంటిల్‌మన్', సుధీర్‌బాబుతో 'సమ్మోహనం' చిత్రాలను ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో నిర్మించిన శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ ముచ్చటగా మూడోసారి నిర్మించే చిత్రానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ప్రియదర్శి రూప కొడువాయూర్ ఇందులో హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేవుని ఫొటోలపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దర్శకుడు మోహనకృష్ణ సతీమణి ఉమా మహేశ్వరి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, నిర్మాత సతీమణి అనిత తొలి క్లాప్ ఇచ్చారు. అనంతరం నిర్మాత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'మా సంస్థకి ఆత్మీయుడు, నాకు అత్యంత సన్నిహితుడు, ప్రతిభాశాలి మోహన్ కృష్ణతో మూడో సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'బలగం'తో హీరోగా పేరు తెచ్చుకున్న ప్రియదర్శికి ఇది యాప్ట్ సబ్జెక్ట్. తెలుగమ్మాయి రూప హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదో క్యూట్ ఫిల్మ్. స్వీట్ ఎంటర్‌టైన్. చక్కటి వినోదంతో పాటు మంచి భావోద్వేగాలు ఉంటాయి. ఈ రోజు నుంచి హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభించాం' అన్నారు. నరేశ్, తనికెళ్ల భరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, కల్పలత, రూపలక్ష్మి, హర్షిణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్య శాస్త్రి, ఫొటోగ్రఫీ: పి.జి. విందా, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: విద్య శివలెంక, లిపక ఆళ్ల, రచన, దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/anC9N16 **లో చదవండి.**

సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్న తాప్సీ





సొట్టబుగ్గల సుందరి తాప్సీ పెళ్లి పీటలెక్కుతోందంటూ కొంత కాలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ తాప్సీ తన ప్రియుడు మథియాస్ బో ను రెండు రోజుల క్రితం పెళ్లాడారు. డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో పదేళ్లుగా డేటింగ్‌లో ఉన్నారు తాప్సీ. పెద్దలను ఒప్పించి సిక్కు, క్రిష్టియన్ సంప్రదాయాల ప్రకారం వీరిద్దరూ ఉదయ్‌పూర్‌లో పెళ్లి చేసుకున్నారు. గుట్టు చప్పుడు కాకుండా జరిగిన ఈ వివాహానికి కుటుంబ సభ్యులు, సన్నిహితులే హాజరయ్యారు. అయితే తన పెళ్లి విషయాన్ని తాప్సీ ఇంతవరకు వెల్లడి చేయలేదు, ఫొటోలు కూడా రిలీజ్ చేయలేదు. కాగా, 2013లో జరిగిన ఇండియన్ బ్యాడ్మింటన్ లీగ్ ప్రారంభ కార్యక్రమంలో మొదటిసారి వీళ్లిద్దరూ కలుసుకున్నారు. అక్కడి నుంచే వారిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. నటి తాప్సీ ఎప్పటికప్పుడు వారి ప్రేమాయణంపై మీడియా అడిగిన ప్రశ్నలను దాటేసేవారు. తమ ప్రేమ బంధాన్ని ఎంతో గోప్యంగా ఉంచిన తాప్సీ ఈ మధ్య ఒక ఇంటర్వ్యూలో మథియాస్‌తో తన పరిచయం గురించి తొలిసారిగా వెల్లడించారు.

మోత... మోత



విభిన్న పాత్రలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకొంటున్న విశ్వక్ సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం విడుదల కోసం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ఇందులో విశ్వక్ సేన్ మాస్‌ని మెప్పించే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. హోలీ సందర్భంగా 'మోత' పాటను విడుదల చేసి, పండగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చింది చిత్ర బృందం. అందాల తార ఆయేషా ఖాన్ ఈ ప్రత్యేక పాట కోసం విశ్వక్ సేన్‌తో కలసి చిందులు వేయడం అదనపు ఆకర్షణ. చంద్రబోస్ రాసిన ఈ మాస్ సాంగ్‌ను ఎం.ఎం. మానసి అభిమానుల్లో ఉత్సాహం నింపేలా పాడారు. థియేటర్లలో ఈ పాట మోత మోగించడం ఖాయం అంటున్నారు. నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి కీలక పాత్ర పోషిస్తున్నారు. మే 17న విడుదలయ్యే ఈ చిత్రానికి సహ నిర్మాతలు: వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నమూరి , నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, రచన, దర్శకత్వం: కృష్ణ చైతన్య.



బిల్డ్ అమరావతి అంటూ మందడం రైతు ధర్నా శిబిరం నుండి ఆందోళనలు చేస్తున్న రైతులు

అమరావతి అభివృద్ధిని విస్మరించిన వైసీపీ పాలకులు

● నియంత పాలన అంతం కావాలి

● 1560వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, మార్చి 25: రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధిని విస్మరించిన వైసీపీ పాలకులు దోషులేనని 33వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి త్యాగం చేసిన రైతులు అన్నారు. మూడు రాజధానులు వద్దు.. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్ర ప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1560వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి పలువురు రైతులు మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిని ఐదేళ్ల నుంచి వైసీపీ పాలకులు పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిని కాలదన్నటం అతి పెద్ద తప్పిదమన్నారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌ను నాశనం చేయాలనుకోవటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు మారుతుంటాయని, రాజధాని అమరావతి శాశ్వతమన్నారు. రైతులపై పెట్టిన అక్రమకేసులను ఎత్తివేయాలన్నారు. నియంత పోకడలు వద్దని హితవు పలికారు. అమరావతిని హైకోర్టు అభివృద్ధి చేయమని చెప్పినా పాలకులలో చలనం లేదన్నారు. కోర్టు తీర్పులను కూడా పట్టించుకోకపోవటం దురదృష్టకరమన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. కాగా ఇప్పుడు ఎన్నికల ఆంక్షలు రావటంతో ధర్నా శిబిరాలలో కాకుండా ఇళ్ల నుండే దీక్షలు, నిరసనలు చేయాలని రాజధాని అమరావతి రైతు జేఏసీ సూచించింది. మూడు రాజధానుల ప్రకటనతో మానసికంగా కుంగిపోయి గుండెపోటు సంభవించి మృతి చెందిన రైతులు, రైతుకూలీలకు సోమవారం రైతు ధర్నా శిబిరాలలో రైతులు, మహిళలు, రైతు కూలీలు నివాళి అర్పించారు.

అభిమానులు, కార్యకర్తలు తలెత్తుకునేలా నిర్ణయం : రావి

● నన్నెందుకు సస్పెండ్ చేశారో నాకు తెలియదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకట రమణ

పొన్నూరుటౌన్, మార్చి25 : కష్ట కాలంలో తన వెంట నడిచిన అభిమానులు, కార్యకర్తల గౌరవాన్ని పెంచే విధంగా రానున్న ఎన్నికలో పోటీపై నిర్ణయం తీసుకుంటాన్ని వైసీపీ బహిష్కృత నేత రావి వెంకట రమణ అన్నారు. సోమవారం గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలో పొన్నూరులో వైసీపీని గెలిపించినప్పటికీ కార్యకర్తలకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు. తాజాగా పొన్నూరు అభ్యర్థిగా కొత్త వ్యక్తిని వైసీపీ ఎంపిక చేసింది, అతను ఎవరో కూడా నాకు తెలియదు అని వ్యాఖ్యానించారు. పోటీపై మాట్లాడుతూ మరో రెండు మూడు రోజులలో కార్యకర్తలతో చర్చించి నిర్ణయించుకోనున్నట్లు చెప్పారు. ఇండిపెండెంట్‌గానా, కాంగ్రెస్ అభ్యర్థిగానా, టీడీపీలోకా, వైసీపీనా అనేది త్వరలోనే చెబుతానన్నారు. 2019 ఎన్నికలో పొన్నూరులో వైసీపీ గెలిచిన తర్వాత తాను ఇక్కడ ఎటువంటి కార్యక్రమాలు జోక్యం చేసుకోలేదన్నారు. పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసిన విషయం టీవీలోనే చూసితెలుసుకున్నానన్నారు. తనకు షోకాజ్ నోటీసులు కానీ, సస్పెన్షన్ ఉత్తర్వులు కానీ అందలేదని తెలిపారు. పార్టీ నుంచి తనను ఎందుకు సస్పెండ్ చేశారో తనకు తెలియటం లేదన్నారు. ఈ సమావేశంలో పలువురు అసంతృప్త వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ మాదిరి పనిచేస్తాం.. అభివృద్ధి సాధిస్తాం!

● బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్‌లో.. నారా మాటామంతీ



తాడేపల్లి ఫైన్‌వుడ్ అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న నారా లోకేశ్, పెమ్మసాని చంద్రశేఖర్

మంగళగిరి, మార్చి 25: ఎన్నికల అనంతరం తాను, పెమ్మసాని చంద్రశేఖర్ డబుల్ ఇంజన్ మాదిరి పనిచేసి మంగళగిరి నియోజకవర్గాన్ని చాల వేగవంతంగా అభివృద్ధి చేస్తామని మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపి అభ్యర్థి నారా లోకేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తాడేపల్లి ఫైన్‌ఉడ్ అపార్టుమెంట్‌వాసులతో జరిగిన బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేష్ కార్యక్రమంలో పెమ్మసానితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ రాబోయే ఇరవై ఏళ్లకు అవసరమయ్యే మౌలికసదుపాయాలను కల్పించేందుకు కావల్సిన సమగ్ర ప్రణాళిక తమ వద్ద సిద్ధంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కృష్ణాజలాలు, రోడ్లు, అండర్‌గ్రౌండు డ్రెయినేజీ, రైతుబజార్లు, శ్మశానవాటికల వంటి అన్ని మౌలికసదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేస్తామన్నారు. తమ విజయంతో మంగళగిరి అభివృద్ధి పరుగులు తీయడం ఖాయమన్నారు. చిన్నతరహా పరిశ్రమలను స్థాపించి యువతకు స్థానికంగానే పెద్దఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో 20వేలమంది పేదలకు పక్కాగృహాలను కట్టించి ఇస్తామన్నారు.

రెండుసార్లు గెలిచిన ఆళ్ల రామకృష్ణారెడ్డితో కలుపుకుని మురుగుడు హనుమంతరావు, కాండ్రు కమల వరుసగా 25 ఏళ్లపాటు మంగళగిరిని పాలించారు. ఈ 25 ఏళ్లపాటు మంగళగిరిలో ఏమైనా అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. పైగా టీడీపి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే ఆళ్ల కేసులు వేసి మంగళగిరి అభివృద్ధిని నిరంతరం అడ్డుకున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో తాడేపల్లిలో కృష్ణాజలాల పథకం తాలూకు పనులను ఆరంభిస్తే జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆపనులను నిలిపేశారన్నారు. ఈ రోజుకు మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రికి నీటి సౌకర్యం కల్పించలేని దుస్థితిలో జగన్ ప్రభుత్వం ఉందంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు.

గత ఎన్నికల్లో తాను ఓటమి చెందినప్పటికీ ఏమాత్రం దిగాలుపడకుండా కసితో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వానికి సమాంతరంగా నడిపిస్తూ వచ్చానన్నారు. మొత్తం 29 రకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు వివరించారు. ఇందులో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీ, ఆరోగ్య సంజీవని, పెళ్లికానుకలు, పేదలలు చనిపోయిన సందర్భాలలో వారి మట్టిఖర్చులు, వీవర్స్‌శాల ద్వారా చేనేతలకు ఉపాధి, తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్ల పంపిణీ, కుట్టు శిక్షణ, కుట్టుమిషన్ల పంపిణీ, నైపుణ్య శిక్షణా కార్యక్రమాల వంటివి ఎన్నో వున్నాయన్నారు. ప్రతిపక్షంలో వున్నపుడే ఇన్నేసి ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టామంటే అధికారంలోకి వస్తే మరెన్ని కార్యక్రమాలను చేపడతామో ప్రజలే అర్థం చేసుకోవాలన్నారు. మళ్లీ చెబుతున్నా...గత ఎన్నికల్లో ఓటమితో అనేక అవమనాలను ఎదుర్కొన్నా...శాసనసభ సాక్షిగా నా తల్లి, తండ్రిని అవమానించారు. నాతోపాటు మీరందరూ ఈ బాధను గుర్తుపెట్టుకోండి. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోండి. ముఖ్యంగా దానిని సద్వినియోగం చేయండి. 53, 500 ఓట్ల భారీ ఆధిక్యంతో నన్ను గెలిపించండని లోకేశ్ మంగళగిరి ఓటర్లను అభ్యర్థించారు. వైసీపి అధికార బలంతో అవాంతరాలు సృష్టించే అవకాశం ఉంది. అయినా ఓర్పుతో ప్రతి ఓటరు ఓటుహక్కును వినియోగించుకుని తనకు విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ రోజుకు పదిమందికి ఫోన్లు చేసి చైతన్యవంతం చేయాలని లోకేశ్ కోరారు.

జగన్ కంటే సద్దాంహుస్సేన్ చాల బెటర్: పెమ్మసాని

గత అయిదేళ్లుగా రాష్ట్రంలో ఇన్ని దుర్మార్గాలను చేసిన వ్యక్తిని ఇప్పటివరకు తానెప్పుడూ చూడలేదని. నిజానికి జగన్ కన్నా నియంత సద్దాంహుస్సేన్ చాల బెటరేమోనని అనిపిస్తుందని గుంటూరు పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. దేశ చరిత్రలో .ఇప్పటివరకు జగన్ చేసినంత విధ్వంసకర పాలనను మరెవరూ చేయలేదని...ఇక ముందెవరూ కూడ ఇంతటి విధ్వంసం చేయలేరేమోనని ఛలోక్తి విసిరారు. చంద్రబాబు హయాంలో అమరావతికి విట్, ఎస్ఆర్ఎం, అమృత వంటి పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాలు వస్తే జగన్‌రెడ్డి వాటికి కనీసం మౌలిక సదుపాయాలను కూడ కల్పించలేక పోయారన్నారు. అమరావతి కన్వెన్షన్, బీఆర్ఎస్ మెడికల్ అండ్ హెల్త్ సెంటర్, ఇండో-యుకే హెల్త్‌కేర్ సెంటర్, హెచ్‌సీఎల్ వంటి సంస్థలు అమరావతి రాకుండా వాటికి కేటాయించిన భూ కేటాయింపులను రద్దుచేసి జగన్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారన్నారు. హైదరాబాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, బసవతారకం కేన్సర్ ఆసుపత్రి రాకుండా అడ్డుకున్నారన్నారు. వీటిల్లో సగం వచ్చినా అమరావతి ప్రాంతం ఎంతోకొంత అభివృద్ధి చెందివుండేదన్నారు. చంద్రబాబుకు ఎక్కడ పేరు వస్తుందోనన్న దుగ్ధతోనే జగన్ వాటన్నింటిని రద్దుచేసి మహాపాపానికి ఒడిగట్టారన్నారు. జగన్ తన కుటిల రాజకీయాల కోసం కులాలను వాడుకుంటున్నారని... ఈ కుటిల కులాల కురుక్షేత్రం నుంచి ప్రజలు బయటకు రావాలని పెమ్మసాని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ పాలనతోనే ముస్లింలకు మేలు

● ఆత్మీయ సమావేశంలో ఎంపీ లావు, యరపతినేని



ఇమామ్, మౌజర్ల ఆత్మీయ సమావేశంలో దువా చేస్తున్న నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

పిడుగురాళ్ల, మార్చి 25: టీడీపీ హయాంలో ముస్లిం మైనారిటీలకు అందించిన దుల్హన్ పథకం, రంజాన్ తోఫా, విదేశీ విద్య, మసీదుల నిర్మాణం వంటి పథకాలు వైసీపీ పాలనలో పూర్తిగా రద్దు చేయడం జరిగిందని నరసరావుపేట పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో గురజాల నియోజకవర్గ స్థాయి ఇమామ్, మౌజర్, మౌలానాల ఆత్మీయ సమావేశం గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో మసీదుల నిర్మాణం, మరమ్మతులకు నిధులు కావాలని 2,500కు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయన్నారు. ఏ ఒక్క మసీదుకు, ఈద్గా నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. గురజాల నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు యరపతినేని శ్రీనివాసరావు అండగా ఉంటూ సొంతంగా సుమారు 50 లక్షల వ్యయంతో అతిపెద్ద ఈద్గాను నిర్మించడంతో పాటు ప్రతి ఏడాది హజ్‌యాత్రకు వెళ్లే వారికి అందిస్తున్న సాయం అందిస్తున్న యరపతినేని రుణం తీర్చుకునేందుకు రానున్న ఎన్నికలలో తనకు, యరపతినేనికి ఓటు వేసి గెలిపించాలన్నారు. గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ తన 30 ఏళ్ల రాజకీయ జీవన ప్రయాణంలో ముస్లిం సోదరులు ఎంతో అండగా వున్నారని, వారికి పదవుల కేటాయింపులోనూ తగిన ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ముస్లిం సోదరులకు రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. దుల్హన్ పథకానికి సవాలక్ష ఆంక్షలు పెట్టడం, రంజాన్ తోఫా రద్దుచేయడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ హయాంలోనే ఇమామ్, మౌజన్, మౌలానాలకు గౌరవ వేతనం ఇవ్వడం జరిగిందని, వైసీపీ పాలనలో అవేమి ఇవ్వడం లేదన్నారు. లావు, యరపతినేనిలు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ హాజరైన ఇమామ్, మౌలానాలను సత్కరించి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాజరైన వారు లావు, యరపతినేనిని సన్మానించడం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలి, చింతపల్లి హసన్‌అహ్మద్, నాలుగు మండలాల ఇమామ్, మౌజన్‌లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశాలకు ఆహ్వానం

చిలకలూరిపేట, మార్చి 25: 2024-25 విద్యా సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో అన్ని సీట్లలో (ప్రతి పాఠశాలలో 80 సీట్లు) 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి సంబంధించి ఏప్రిల్ 25న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్టు చిలకలూరిపేట ఏపీఆర్ స్కూల్ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ ఎన్ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు ఆ రోజున ప్రవేశపరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి వివరాలకు ఫోన్ నెంబర్లు 93910 05515, 93910 05813, 93910 05812 లో సంప్రదించవచ్చని తెలిపారు.

యువత భవితను చిదిమేస్తున్న జగన్ డ్రగ్ మాఫియా: భాష్యం ప్రవీణ్

గుంటూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): యువత భవితను జగన్ డ్రగ్ మాఫియా చిదిమేస్తోందని కూటమి పెదకూరపాడు అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఆరోపించారు. ఆ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. దేశానికి అన్నపూర్ణగా వున్న రాష్ట్రాన్ని డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని ఆయన ఆరోపించారు. ఏపీని మత్తు పదార్థాల రాజధానిగా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడ ఏది దొరికినా దాని మూలాలు మాత్రం రాష్ట్రంలోనే దొరుకుతున్నాయన్నారు. టీడీపీ హయంలో పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం నెంబర్ వన్‌గా వుంటే జగన్ పాలనలో గంజాయి, డ్రగ్స్ రవాణాలో నెంబర్ వన్ స్థానానికి చేరిందన్నారు. రాజధానిని విశాఖకు మారుస్తానని చెప్పి తెర చాటున డ్రగ్స్ దిగుమతులు చేసుకుంటూ డ్రగ్స్ క్యాపిటల్‌గా విశాఖను మార్చారన్నారు. డ్రగ్స్ కేసులో వైసీపీ నేతల పాత్ర ఏంటో తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు.

టీడీపీ సీనియర్ నేతలు కన్నా, నరేంద్ర భేటీ

● పరస్పర సహకారంతో గెలుపు కోసం సమాలోచన



సమావేశమైన టీడీపీ నేతలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

గుంటూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి , సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే, పొన్నూరు టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సోమవారం గుంటూరులో సమావేశమయ్యారు. గతంలో వీరిద్దరూ వేరువేరు పార్టీల్లో కొనసాగి రాజకీయ పరంగా విభిన్న ధృవాలుగా వ్యవహరించేవారు. వారి వారి పార్టీలను సమర్థించుకుంటూ వివిధ రాజకీయ అంశాలపై ఒకరిపై ఒకరు కత్తులు దూసుకునేవారు. కాంగ్రెస్ వేదికగా కన్నా లక్ష్మీనారాయణ వరుసగా ఐదు పర్యాయాలు విజయం సాధించి అనేక మంది ముఖ్యమంత్రుల వద్ద వివిధ శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. కాగా కన్నా నాలుగు పర్యాయాలు పెదకూరపాడు నియోజకవర్గం నుంచి ఐదో పర్యాయం గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కాగా ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తన తండ్రి వీరయ్య చౌదరి వారసత్వంగా ఆయన మరణానంతరం రాజకీయాల్లోకి అడుగిడి పొన్నూరు నియోజకవర్గం నుంచి వరుసగా ఐదు పర్యాయాలు గెలుపొంది టీడీపీలో సీనియర్ నేతగా వెలుగొందుతున్నారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వీరిద్దరూ ఇప్పుడు ఒకే పార్టీలో కొనసాగుతున్నారు. ఇద్దరూ కూడా ఈ పర్యాయం జరిగే ఎన్నికల్లో విజయం సాధించి ఆరో పర్యాయం అసెంబ్లీలో అడుగుపెట్టాలనే ధ్యేయంతో ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. కన్నా టీడీ పీలో చేరిన తరువాత పలు పార్టీ కార్యక్రమాల్లో ఇద్దరూ కలుసుకొని మాట్లాడుకోవటం జరిగింది. అయితే మొట్టమొదటి సారిగా నరేంద్ర సోమవారం ఉదయం కన్నా నివాసానికి వచ్చి పార్టీ పరమైన అంశాలపై చర్చించుకోవటం జరిగింది. కాపు సామాజికవర్గంలో ఎంతో పేరొందిన కన్నా సహకారాన్ని రానున్న ఎన్నికల్లో తన గెలుపు కోసం ఉపయోగపడేలా చేయాలని నరేంద్ర కోరారు. అలాగే టీడీపీలో సీనియర్ నేతగా ఉన్న నరేంద్ర పరిచయాలను సత్తెనపల్లిలో తనకు సహకరించేలా చేయాలని కన్నా కోరటం జరిగింది. అంతేగాకుండా రానున్న ఎన్నికల్లో జగన్ రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి చేయాల్సిన కృషి, ప్రచార అస్త్రాలపై కూడా వారు చర్చించుకున్నారు.

ముగ్గురు వలంటీర్లపై వేటు

రేపల్లె, మార్చి 25: వైసీపీ తరపున ప్రచారంలో పాల్గొన్న ముగ్గురు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి సోమవారం తెలిపారు. వైసీపీ రేపల్లె అభ్యర్థి ఈవూరి గణేష్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండగా, ఆ ముగ్గురు వలంటీర్లు ప్రచారంలో పాల్గొని ఆయన గెలుపునకు ప్రతి ఒక్కరూ ఓటు వెయ్యాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఆ విషయాన్ని ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్‌లో కథనం ప్రచురించగా, స్పందించిన ఎంపీడీవో శ్రీనివాసమూర్తి చర్యలు తీసుకున్నారు. ఆ ముగ్గురు వలంటీర్లను విధుల నుంచి తొలగించామని తెలిపారు. రాంబొట్లవారిపాలెం క్లస్టర్ నంబరు 11లో పీ గంగారెడ్డి, కనగాల సచివాలయం పరిధిలోని క్లస్టర్ నంబరు 24, 25లో ఉన్న షేక్ ఫయాజ్ అహ్మద్, కట్టా గోపీలను విధుల నుంచి తొలగించామని ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా వలంటీర్లు ప్రచారంలో పాల్గొంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కేశానుపల్లిలో ఒకరు...

దాచేపల్లి, మార్చి 25: మండలంలోని కేశానుపల్లి గ్రామానికి చెందిన రాజవరపు నవీన్ అనే వలంటీర్‌ను విధుల నుండి తొలగిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం తెలిపారు. వలంటీర్‌గా పనిచేస్తున్న నవీన్ తన ఫేస్‌బుక్‌లో జగన్‌కు సంబంధించిన పోస్టులను పెట్టడం అధికారుల దృష్టికి వచ్చింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో భాగంగా నవీన్‌ను విధుల నుండి తొలగిస్తున్నట్లు అధికారులు వివరించారు.



తెనాలి క్రైం, మార్చి 25 : మాయమాటలతో ఓ బాలికను లొంగదీసుకుని గర్భవతిని చేశాడు. పెద్దలు పెళ్లి చేసుకోమంటే గుజరాత్ రాష్ట్రానికి పారిపోయి దాక్కున్నాడు. డీఎస్పీ ఎం.రమేష్‌బాబు తెనాలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

బాలికను గర్భవతి చేసిన యువకుడు అరెస్టు

పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న బాలికను ఆ పక్క షాపులో పని చేస్తున్న మహారాష్ట్రకు చెందిన యువకుడు ప్రశాంత్ జగదీష్ (21) బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి లొంగదీసుకుని గర్భవతిని చేశాడు. ఇది గుర్తించిన బాలిక తల్లిదండ్రులు పెళ్లి చేసుకోవాల్సిందిగా పెద్దల చేత అడిగించారు. దానికి నిరాకరించిన యువకుడు ఇక్కడి నుంచి పారిపోయాడు. దీనిపై బాధితురాలు జనవరి 29వ తేదీన ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పారిపోయిన ఆ యువకుడు పోలీసులు వెంటాడుతారన్న భయంతో తన సొంత రాష్ట్రం మహారాష్ట్రకు వెళ్ళకుండా వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ చివరికి గుజరాత్‌లోని భావనగర్‌కు చేరుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అతన్ని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి కోర్టులో హాజరు పరచిన పిదప సోమవారం తెనాలికి తీసుకు వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భట్టిప్రోలు, మార్చి 25: రేపల్లె మండలం కారుమూరు గ్రామానికి చెందిన తెనాలి నాగయ్య (47) కొల్లూరు మండలం తోకలవానిపాలెం గ్రామానికి తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ఆదివారం రాత్రి గ్రామానికి తిరిగి వస్తుండగా మండలంలోని వెల్లటూరు గ్రామ శివారు వద్ద రాళ్ళ గుట్టలు ఉన్నాయి. రాత్రివేళ ఆ రాళ్లగుట్టలు కనిపించకపోవ ద్విచక్రవాహనం ఆ రాళ్లగుట్టను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగయ్య రోడ్డుపైపడి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

కోడ్ అమలులో అధికారుల ఉదాసీనత

● సర్పంచ్ ఇంటి గోడపై ఉన్న హోర్డింగ్‌ను వదిలేసిన అధికారులు



గాజుల్లంకలో సర్పంచ్ ఇంటి గోడపై వైసీపీ హోర్డింగ్

కొల్లూరు, మార్చి 25 : ఎన్నికల కోడ్ అమలులో అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులోకి వచ్చి సుమారు 10 రోజులు కావస్తున్న కొన్ని చోట్ల వైసీపీ నాయకుల ఇళ్లపై ఉన్న జెండాలు, హోర్డింగ్‌లు తొలగించకుండా వదిలేశారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం గాజుల్లంకలో గ్రామ సర్పంచ్ సనకా వెంకట్రావు ఇంటి గోడపై వైసీపీ హోర్డింగ్ ఎప్పుడో ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే అన్ని చోట్ల ఆయా రాజకీయ పార్టీల బ్యానర్లు, హోర్డింగ్‌లు తదితర వాటిని తొలగించినా సర్పంచ్ ఇంటిగోడపై ఉన్న హోర్డింగ్‌ను మాత్రం అధికారులు చూసి చూడనట్లు వదిలేశారు. సర్పంచ్‌కు ఎన్నికల కోడ్ వర్తించదా అంటూ రాజకీయ పార్టీల నాయకులు హోర్డింగ్‌ను చూసి ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ అనుమతులు ఉండటంతో హోర్డింగ్ ఉంచారా అంటే అదీ లేదు. దీనిపై జడ్పీ సీఈవో వేమూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడుని కొల్లూరు మండలంలో హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు, ప్రచార వాహనాలకు ఎవరికైనా అనుమతులు ఇచ్చారా అని వివరణ కోరగా హోర్డింగ్‌లు, బ్యానర్లు తదితర వాటికి దరఖాస్తు చేసుకుంటే అనుమతులు మంజూరు చేస్తామని, ఇప్పటి వరకు ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదని ఏడు ప్రచార వాహనాలకు మాత్రం అనుమతులు మంజూరు చేయడం జరిగిందని ఆయన వివరించారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి ఆనందబాబు

ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి

● మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

భట్టిప్రోలు, మార్చి 25 : సుఖసంతోషాలతో ప్రజలు జీవించాలని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మల్లేశ్వరస్వామివారిని వేడుకున్నారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన సమారాధనలో భక్తులు వేలాదిగా పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు. తొలుత ఆనందబాబు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ సంఘీయులు బట్టు బల్లికార్జునరావు, వంగర వీరయ్య, కౌతరపు శ్రీనివాసరావు, బట్టు నగేష్‌బాబు, గొట్టుముక్కల లెనిన్, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

బాధితకుటుంబానికి పరామర్శ.

అమృతలూరు: అమృతలూరు గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు షేక్ సంషూన్నిసాబి (80) ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు షేక్ సంషూన్నిసాబి కుమారుడు, టీడీపీ నేతల అయిన షరీఫ్‌ను సోమవారం పరామర్శించారు. ఆయన వెంట క్రొత్తపల్లి రవీంద్రబాబు, గొట్టిపాటి గంగాధర్, మౌలాలీ, తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థికసాయం

అమృతలూరు, మార్చి 25 : మండలంలోని ఇంటూరు గ్రామానికి చెందిన ఊసరపు సుబ్బారావు ఇల్లు రెండు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. దీంతో సాయం కింద సుబ్బారావుకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు బూరగ సుబ్బారావు సోమవారం రూ.5 వేలు నగదును అందించారు. ఆయన వెంట పార్టీ నాయకుడు తాడికొండ వెంకటేశ్వరరావు, దేవరపల్లి అంబేద్కర్, విభాపూజీ తదితరులు ఉన్నారు.

31న చంద్రబాబు బహిరంగ సభ

రేపల్లె, మార్చి 31 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన ప్రజా గళం యాత్ర ఈనెల 31వ తేదీన రేపల్లె నియోజకవర్గంలో జరగనున్నది. ఈమేరకు నగరం మండలం పమిడిమర్రు గ్రామంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పమిడిమర్రు గ్రామంలో సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సభకు నియోజకవర్గంలోని తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

ఇసుక తవ్వకాలపై విస్తృత తనిఖీలు

● జిల్లా మైనింగ్ అధికారి రాజేష్

బాపట్ల, మార్చి 25 : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ ఇసుక తవ్వకాలపై విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా మైనింగ్ అధికారి రాజేష్ తెలిపారు. ఈవిషయమై సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఎక్కడా ఇసుక అక్రమ తవ్వకాలు జరగటం లేదన్నారు. చినగంజాం ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణ చేస్తున్న వారికి రూ. 2.30 లక్షలు, కొల్లూరు ప్రాంతంలో రూ. 3లక్షలు, అద్దంకి ప్రాంతంలో రూ.50 వేలు అపరాధ రుసుం వసూళ్ళు చేశామన్నారు. ప్రస్తుతం కొల్లూరు ప్రాంతంలోని గాజులంక, జువ్వలపాలెం, ఓలేరు ప్రాంతాలలో ఇసుకరీచ్‌లు అన్ని అనుమతులు పొంది ప్రారంభం కానున్నాయన్నారు. అయినప్పటికి మైనింగ్ సిబ్బంది జిల్లా మొత్తం విస్తృత తనిఖీలు నిర్వహించి అక్రమ ఇసుక తవ్వకాలపై ఉక్కుపాదం మోపుతుందన్నారు. అంతేకాకుండా సంబంధిత సెబ్, రెవెన్యూ, పోలీసు అధికారులను ఇసుక అక్రమ తవ్వకం, రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు జిల్లా మైనింగ్ అధికారి రాజేష్ తెలిపారు.



చిన్నారులతో ఎన్నికల ప్రచారం చేయిసున్న దృశ్యం

బాలలతో వైసీపీ ఎన్నికల ప్రచారం

బాపట్ల, మార్చి 25 : ఎమ్మెల్యే కోన రఘుపతి మూలపాలెం గ్రామంలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో వైసీపీ నేతలు బాలలను సైతం పాల్గొనేలా చేశారు. పార్టీ జెండాలు పట్టుకొని టోపీలు పెట్టుకొని గ్రామవీధులలో బాలలతో ఎన్నికల ప్రచారం చేయటం చర్చనీయాంశంగా మారింది. ఏ మాత్రం రాజకీయాలు తెలియని, పాఠశాలలకు వెళ్లే పిల్లలతో ఈవిధంగా ఎన్నికల ప్రచారం చేయించటం సరికాదని పలువురు విమర్శించారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

బాపట్ల,మార్చి 25 : వైసీపీ ఎన్నికల ప్రచారంలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. గ్రామ పంచాయతీలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న బెజ్జం రాజు అనే వ్యక్తి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. అదేవిధంగా ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎంపీ నందిగం సురేష్‌లు పార్టీకుండువాలతో చర్చిలోకి వెళ్ళి ప్రార్థనల్లో పాల్గొన్నారు. మొదటిరోజు ప్రచారంలోనే ఈవిధంగా కోడ్ ఉల్లంఘనకు పాల్పడటంపై అనేక విమర్శలు వస్తున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

నేమ్ బోర్డు లేని రైల్వే స్టేషన్



వేమూరు రైల్వే క్రాసింగ్ ప్లాట్ ఫామ్

వేమూరు, మార్చి 25 : వేమూరు రైల్వే స్టేషన్‌కు గత రెండు సంవత్సరాల నుండి నేమ్ బోర్డు లేదు. అభివృద్ధి పనుల నిమిత్తంగా రెండేళ్ళ నాడు కాంట్రాక్టర్ నేమ్ బోర్డును ప్లాట్‌ఫారంపై పడవేశారు. సంబంధిత కాంట్రాక్టర్ తన వంతు పనులు పూర్తి చేసినప్పటికీ బోర్డు మాత్రం ఏర్పాటు చేయలేదు. ఈ విషయాన్ని ప్రాంతీయ కమిటీ సభ్యులు ఒకరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. అయినా స్పందన లేదు. ప్రయాణికులు బోర్డు లేని కారణంగా ఇబ్బంది పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుండి ఈ ప్రాంతానికి ప్రయాణించే ప్రయాణికులు అయితే వేమూరు స్టేషన్ గుర్తుతెలియక సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్టేషన్ క్రాసింగ్ ప్లాట్‌ఫారం వద్ద నేమ్ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి పుష్పయాగం జరుపుతున్న పండితులు

వైభవంగా పుష్పయాగ మహోత్సవం

బాపట్ల, మార్చి 25 : శ్రీలక్ష్మీజయంతి సందర్భంగా పట్టణంలోని చీలురోడ్డులో వేంచేసియున్న పాండురంగాస్వామి దేవాలయ ప్రాంగణంలో పుష్పయాగమహోత్సవం, లక్ష్మీహోమం నిర్వహించారు. శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి పుష్పయాగమహోత్సవం అనంతరం పద్మపుష్పయుక్త ఐశ్వర్యప్రద లక్ష్మీహోమం జరిగాయి. శ్రీలలితత్రిపురసుందరి పీఠ నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పండితులు మేడూరి వెంకటఅప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, పరాశరం రఘురామాచార్యులు యాజ్ఞీక పర్యవేక్షణలో జరిగింది. దేవస్థాన ధర్మకర్త మార్పూరి బదిరీ నారాయణ పర్యవేక్షించారు.

ముస్లింల సంక్షేమం, అభ్యున్నతికి కృషి

● బాపట్ల నియోజవర్గ కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

● ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు, ప్రత్యేక ప్రార్థనలు

బాపట్ల, మార్చి 25 : ముస్లింల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి కృషి చేస్తానని టీడీపీ జనసేన, బీజేపీ బాపట్ల నియోజవర్గ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. పవిత్రరంజాన్ మాసాన్ని పురస్కరించుకొని బాపట్ల పట్టణంలోని 31వ వార్డు విజయలక్ష్మీపురం అక్సా మసీదులో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మసీదు అభివృద్ధి పనులను ప్రారంభిస్తానని హామీనిచ్చారు. ముస్లింల సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు అల్లాహంభక్షి, కార్యదర్శి ఖయ్యూం, ఉపాధ్యక్షులు షేక్ కరీముల్లా, జాయింట్ సెక్రటరి షరీఫ్, షేక్.హనీఫ్, సయ్యద్ అమీర్, వై.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

ఐటీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరావుకు పరామర్శ ..

బాపట్ల పార్లమెంట్ ఐటిడిపి అధ్యక్షులు మానం శ్రీనివాసరావు అస్వస్థతకు గురయ్యారు. గుంటూరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అయనను సోమవారం వేగేశన నరేంద్రవర్మ పరామర్శించారు. వైద్యులను ఆరోగ్య పరిస్థితులు గురించి అడిగి తెలుసుకొని శ్రీనివాసరావును ఓదార్చి తాను ఉన్నానని హామినిచ్చారు.

సలగలను కలిసిన అభ్యర్థులు.. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకులు సలగల రాజశేఖర్‌ను స్థానిక విద్యానగర్‌లోని ఆయన నివాసంలో బాపట్ల ఎంపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్, బాపట్ల, చీరాల ఎమ్మెల్యే అభ్యర్థులు వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం.కొండయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణలు కలిశారు. ఎన్నికలలో చేపట్టాల్సిన కార్యక్రమాలు గురించి చర్చించారు. పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. పార్లమెంట్ పరిధిలో సలగల రాజశేఖర్‌కు ఉన్న పరిచయాలు, అనుభవాలను దృష్టిలో పెట్టుకొని తమ విజయానికి సహకరించాలని కోరారు.



సలగల రాజశేఖర్‌తో టి.కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం.కొండయ్య

ఉత్సాహంగా హోలీ..

రేపల్లె, మార్చి 25: రేపల్లె నియోజకవర్గంలో సోమవారం హోలీ పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు అని తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ ఎంతో సంతోషంగా పండుగను జరుగపుకున్నారు. అనంతరం మిఠాయిలను పంపిణీ చేశారు.

కర్లపాలెం: మండల కేంద్రమైన కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్‌లో చిన్నారులు, ఉపాధ్యాయులు హోలీ సంబరాలను కన్నుల పండుగగా నిర్వహించారు. చిన్నారులందరు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులందదూ రంగులను నీళ్ళల్లో కలిపి ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మండల ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు, పలు గ్రామాలలోని చిన్నారులు, ప్రజలు పోటీలు పడి రంగులు చల్లుకొని హోలీవేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హైవెండ్ హైస్కూల్ పెదమల్లు చాందిని, పీఈటీ గోపిచంద్, ఉపాధ్యాయులు రఫీ, ఆదినారాయణ, షర్మిలబేగం, నెహా, రజియాసుల్తాన, స్వప్న, సుమలత, ద్వారక తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె పట్టణంలో హోలీ పండుగలో పాల్గొన్న ప్రజలు



కర్లపాలెం హైవెండ్ హైస్కూల్లో హోలీ సంబరాలలో పాల్గొన్న చిన్నారులు



మల్లేశ్వరుని వసంతోత్సవంలో పాల్గొన్న యువకులు, సంఘీయులు

భ్రమరాంబ మల్లేశ్వరుల వసంతోత్సవం

భట్టిప్రోలు, మార్చి 25 : భ్రమరాంబ మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్లకు ఉదయం బింది తీర్థం, అభిషేకం, నిత్య హోమాలతో పాటుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దేపల్లి - భట్టిప్రోలు పద్మశాలీయ సంఘీయుల ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి వసంతోత్సవం, సాయంత్రం సహస్రదీపోత్సవం, ధ్వజావరోహణ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోన ఎన్నికల ప్రచారం ప్రాంభం

బాపట్ల, మార్చి 25 : ఎమ్మెల్యే కోన రఘుపతి బాపట్ల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని సోమవారం ప్రారంభించారు. పార్టీశ్రేణులు, ఎంపీ నందిగం సురేష్‌లతో కలిసి ఆయన మూలపాలెం గ్రామంలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ఓటర్లను అభ్యర్థించారు. అదేవిధంగా ఎమ్మెల్యే సతీమణి కోన రమాదేవి పార్టీశ్రేణులతో కలిసి బాపట్ల పట్టణంలోని 9వవార్డు మూర్తి రక్షణీనగర్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

ఎమ్మెల్యే తనయులు కోన నిఖిల్ పిట్టలవానిపాలెం మండలంలో ప్రచారం ప్రారంభించగా సినీ రచయత కోన వెంకట్ కర్లపాలెం మండలంలో ప్రచారం ప్రారంభించి కోన రఘుపతి, నందిగం సురేష్‌లను గెలిపించాలని అభ్యర్థించారు.



కృష్ణమూర్తి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా నేతలు తదితరులు

సీపీఎం నేత కృష్ణమూర్తి మృతి

● నివాళులర్పించిన ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు

కొల్లూరు, మార్చి 25 : సీపీఎం సభ్యుడు వల్లభనేని కృష్ణమూర్తి భౌతికకాయానికి ఆ పార్టీ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు సోమవారం నివాళులర్పించారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం పక్కనేవున్న కృష్ణాజిల్లా ఆముదాల లంక గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు, విశ్రాంత వైద్యులు వల్లభనేని కృష్ణమూర్తి(81) ఆదివారం విజయవాడలోని ఆయన కుమారుడు నివాసంలో కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసరావు, జిల్లా నాయకులు గంగయ్య తదితరులు ఆయన భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పి పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల కార్యక్రమంలో సీపీఎం నేతలు పలువురు పాల్గొన్నారు.

డ్రగ్స్ వలయంలో ఆంధ్రప్రదేశ్

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

గుంటూరు, మార్చి 25 : జగన్‌రెడ్డి ధన దాహానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డ్రగ్స్ వలయంలో చిక్కుకుందని, యువత మత్తులో కూరుకుపోయి ప్రమాదకర పరిస్థితిలో విలవిల్లాడుతోందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం ధారూనాయక్ సోమవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం అని మాయ మాటలు చెప్పి అందలం ఎక్కిన జగన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైన జగన్ రెడ్డి రాష్ట్రాన్ని డ్రగ్స్ మయం చేసారన్నారు. యువత ఉపాధి కోసం వలసలు వెళ్తున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని జగన్ రెడ్డి చెప్పిన మాయమాటలు నమ్మిన యువత నేడు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక చెడు అలవాట్లకు, వ్యసనాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కృష్ణప్రసాద్ గెలుపునకు కృషిచేస్తాం

● దళిత మీడియా ట్రస్ట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మూల్పూరు

తెనాలి అర్బన్, మార్చి 25: బాపట్ల ఎంపీగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ డీపీజీ టి.కృష్ణప్రసాద్ గెలుపుకోసం కృషి చేస్తామని దళిత మీడియా ట్రస్ట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మూల్పూరు మాణిక్యరావు అన్నారు. సోమవారం తెనాలిలో విలేకరులతో మాట్లాడుతూ, దళిత స్వరాన్ని పార్లమెంట్‌లో నిర్భయంగా వినిపించే సత్తా కృష్ణప్రసాద్‌కు ఉందన్నారు. జిల్లా ఎస్పీగా కూడా పనిచేసిన ఆయనకు బాపట్ల ప్రాంత పరిధిలో సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి ఇచ్చిన నిధులతో అమలుచేసిన పథకాలను సొంత పథకాలుగా చెప్పుకుంటోందని విమర్శించారు. పథకాల అమలులో రూ.కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గల్లా వెంకటకోటేశ్వరరావు, జనసేన నాయకులు రమేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

తెనాలి అర్బన్, మార్చి 25: అన్నమయ్య జిల్లా కొత్తమాధవరం గ్రామంలో కుటుంబం మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. సోమవారం తెనాలిలో విలేకరులతో మాట్లాడుతూ, సంఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సుబ్బారావు, ఆయన భార్య, కుమార్తె మరణాలకు కారకులైన అధికార, అనధికార వ్యక్తులను శిక్షించాలన్నారు. భూమి రికార్డులు తారుమారు చేయడం వెనుక ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని ఉన్నవారిపై 306సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలన్నారు.

అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య

పెదనందిపాడు, మార్చి 25 : పెదనందిపాడు మండలం కొప్పర్రులో అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం వలపర్ల వెంకటేశ్వరరావు (36) కొన్నేళ్లుగా పొలం కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. ఈ ఏడాది 4 ఎకరా లు కౌలుకు తీసుకొని మిర్చి పంట సాగు చేయగా అధిక వర్షాలు, తెగుళ్ళ బెడదతో పూర్తిగా పాడవడంతో పంట ను పీకేసి, శెనగ పంట సాగు చేశారు. అదికూడా ఆశించిన దిగుబడి రాకపోవడంతో తెచ్చిన అప్పులు ఆరు లక్షలకు పెరిగిపోయాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక మన స్థాపానికి గురై ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. ఇది గమనించిన బంధువులు 108 వాహనంలో గుంటూ రు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు భార్య భారతి ఫిర్యాదులో తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్నుల పండువగా కల్యాణమహోత్సవం

బాపట్ల, మార్చి 25 : పట్టణంలోని మున్నంవారిపాలెంలో వేంచేసియున్న శ్రీ గోపయ్యసమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణమహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తనం పెద్దసంఖ్యలో విచ్చేశారు. దంపతులు పీటలమీద కూర్చొని కల్యాణం జరిపించారు. పండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని భక్తులతో పాటు పరిసరప్రాంతాలు నుంచి విచ్చేసిన భక్తజనంతో ఆలయప్రాంగణం కిక్కిరిసింది. మంగళవారం తిరునాళ్ళ మహోత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.



గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



కార్యక్రమానికి హాజరైన భక్తజనం

కార్యక్రమంలో భాగంగా కొమ్మూరి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం పార్వతిదేవి, కుమారులు కొమ్మూరి సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, అశోక్‌లు అన్న ప్రసాదవితరణ చేశారు.

మస్లింల ప్రయోజనాల కోసం

ముందుండి పోరాడుతా

● ముస్లింలకు ఎల్లప్పుడూ అండగా ఉన్నది ధూళిపాళ్ళ కుటుంబమే

● మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ నరేంద్రకుమార్



ముస్లింల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మార్చి 25: ముస్లింల ప్రయోజనాలకు విఘాతం కలిగితే తానే ముందుండి పోరాడుతానని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని 25, 26, 27, 28, 29 వార్డులకు చెందిన ముస్లింలతో సోమవారం పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులో నరేంద్రకుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న పలువురు ముస్లింలు గత ఐదేళ్లుగా తాము ఎదుర్కొన్న సమస్యలు గురించి వివరించారు. దుల్హన్ పథకం, రంజాన్ తోఫా నిలిపివేశారన్నారు. విదేశీ విద్య, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వటంలేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పించన్లను వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు బిల్లుల పేరుతో తొలగించారని ఆరోపించారు. నిలిచిపోయిన షాదీఖానాను పూర్తి చేయాలని నూతన ఈద్గా, కబరస్థాన్ ఏర్పాటు చేయాలని కోరారు. వార్డులో రహదారులు, మురుగు నీటి కాల్వలు లేకుండా పడుతున్న ఇబ్బందుల గురించి వివరించారు. సమావేశంలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ గత 45ఏళ్లుగా పొన్నూరు పట్టణంలో ముస్లింలకు అండగా ఉన్నది తమ కుటుంబమేనన్నారు. బాబ్రీ మసీద్ గొడవల సమయంలో అమాయిక ముస్లిం యువతపై అక్రమ కేసులు పెట్టి జైలుపాలుచేసి వేధిస్తుంటే తన తండ్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేశారు. అయ్యప్ప దీక్షలో ఉండి వీరయ్య చౌదరి ముస్లింల కోసం అప్పటి అధికారి ఎస్పీ మీనాపై చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. అమాయక యువతపై పెట్టిన కేసులను తొలగించింది కూడా తెలుగుదేశం ప్రభుత్వమేనని గుర్తు చేశారు. 2014-2019లో కూడా రాష్ట్రంలో బీజేపీతో కలిసి ప్రభుత్వాని ఏర్పాటు చేశామన్నారు. ఆ సమయంలో తొలిసారిగా ఇమామ్‌లకు, మౌనాజన్లకు వేతనాలు అందించామని, మసీదుల మరమ్మతులకు నిధులు అందించినట్లు చెప్పారు. అలాగే దుల్హన్ పథకం కింద పేద ముస్లిం యువతుల వివాహాల కోసం అందించిన సహాయాన్ని గుర్తుచేశారు. అలాగే చంద్రన్న బీమా ద్వారా మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించటం తోపాటు అబ్దుల్ కలామ్ పేరుతో విదేశీ విద్య పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు విదేశీ విద్యను అందించినట్లు చెప్పారు. ముస్లింల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కానీ 2019వ సంవత్సరంలో ముస్లింల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ముస్లింల కోసం ప్రత్యేకంగా ఒక రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలు నిలిపివేయటమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా 107 ముస్లిం కుటుంబాలపై దాడులు జరిగాయని దుయ్యబట్టారు. మిస్బ అనే బాలిక అత్యధిక మార్కులు తెచ్చుకున్నదన్ని వైసీపీ నాయకుడి వారుసుల కోసం బాలికను వేధించిన సంఘటనను గుర్తు చేశారు. కర్నూలులో వైసీపీ నాయకుల అరాచకాలు తట్టుకోలేక ఒక ముస్లిం కుటుంబం మొత్తం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. పొన్నూరులో కూడా ముస్లింలపై జరిగిన అఘాయిత్యాల గురించి వివరించారు. చేబ్రోలులో మార్కెట్ యార్డు ఉద్యోగిని లారీతో గుద్దించటం, మద్యం షాపునకు వ్యతిరేకంగా పోరాడిన కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిని హత్యచేసిన సంఘటనలు పొన్నూరులో ఉన్నాయన్నారు. ముస్లిం సమాజం రెండు ప్రభుత్వాల మధ్య జరిగిన మంచి చెడులను బేరీజు వేయాలని సూచించారు. అలాగే వైసీపీ ప్రభుత్వంలోనే ఎనార్సీ, సీఐఏ అమలుకు మద్దతు పలికిన విషయాని గుర్తుచేశారు. తన తండ్రి వీరయ్యచౌదరి వలే ముస్లింలకు ఏ ఆపద వచ్చిన తాన ముందుండి పోరాడుతానని నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు, ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ నక్కా అఖిలేష్

టీడీపీ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి

చుండూరు మార్చి 25: టీడీపీ తిరిగి అధికారంలోకి రావడంద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేష్ తెలిపారు. సోమవారం రాత్రి వలివేరులో సూపర్ 6 పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలేష్ మాట్లాడుతూ పరిపాలనలో అన్నివిధాలు తెలిసిన మేధావి చంద్రబాబు అని, ఆయన సీఎం అవడం ద్వారానే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. రైతు, యువత నిర్వేదంలోకి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపడానికి చంద్రబాబును అధికార పీఠంపై నిలపాలని ఆయన కోరారు. సూపర్ 6 పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల అభున్నతికి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి, నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మణప్పురం ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

కొల్లూరు, మార్చి 25 : మణప్పురం సంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పిన్నబోయిన బాలశేఖర్ (21) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యశాలలో మృతి చెందినట్లు ఏఎస్‌ఐ అర్జున్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా పెదరావీడు మండలం తంబడపల్లె గ్రామానికి చెందిన పిన్నబోయిన బాలశేఖర్ ఆరు నెలల క్రితం మణప్పురం ఫైనాన్స్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరాడు. గిద్దలూరు, వినుకొండలో పని చేసి 20 రోజుల క్రితం కొల్లూరు మణప్పురం ఫైనాన్స్‌లో తాత్కాలిక మేనేజర్‌గా వచ్చి విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 21వ తేదీన నాగార్జున అనే నూతన మేనేజర్ విధుల్లో చేరాడు. ఆయనకు కార్యాలయ చార్జి అప్పగించే క్రమంలో భాగంగా తనఖా పెట్టుకున్న బంగారు నిల్వలను పరిశీలించగా కొంత బంగారం లెక్కల్లో తేడా వచ్చింది. ఈ విషయాన్ని తన బావకు చెప్పగా ఏదో ఒకటి చేసి నగదు జమ చేద్దాములే అని భరోసా ఇవ్వడం అదే విషయం మేనేజర్ కూడా చెప్పాడు. ఈ విషయంలో మనస్థాపం చెందిన సదరు ఉద్యోగి 23వ తేదీ అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకునేందుకు పురుగుల మందు తాగాడు. దీంతో వాంతులు చేసుకోవడంతో నిద్ర నుంచి లేచిన మేనేజర్ నాగార్జున ఏమైందని అడగడంతో బంగారం తేడా రావడంతో పురుగు మందు తాగానని ఆయనకు తెలిపాడు. దీంతో మేనేజర్ ఈ విషయాన్ని ఉద్యోగి తల్లి రాజమ్మకు ఫోన్ ద్వారా సమాచారం అందించి చికిత్స నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకు వస్తున్నట్లు తెలిపాడు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. తల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు తెలిపారు. లెక్కలో తేడా వచ్చిన బంగారం ఎంతనేది దర్యాప్తులో తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

వైభవంగా వీరాంజనేయస్వామి తిరునాళ్లు



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ, వీరాంజనేయస్వామి కటౌట్

చినగంజాం, మార్చి 25: కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మార్కెట్ సెంటర్లో వేంచేసియున్న శ్రీవీరాంజనేయస్వామి తిరునాళ్ల సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి వేకువజాము నుంచే అభిషేకాలు, ఆకుపూజలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ పూజారి మాజేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామిని పలు రకాల పూలమాలలతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయం దేదీప్యమానంగా వెలుగొందింది. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభ, వీరాంజనేయస్వామి విద్యుత్ కటౌట్‌ను ఏర్పాటుచేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి.

'చీరాల'లో మహిళలే కీలకం

చీరాల, మార్చి 25: చీరాల నియోజకవర్గంలో మహిళల ఓట్లే కీలకం కానున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 2,00,332(ప్రస్తుతం) మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 97,559 మంది, మహిళలు 1,02,750 మంది, ఇతరులు 23 మంది ఉన్నారు. పురుషుల కన్నా మహిళల ఓట్లు 5వేల చిలుకు ఉన్నాయి. దీంతో మహిళా ఓటర్లు కీలకం కానున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు ఓట్లు చేర్చుకునే అవకాశం ఉంది. అప్పటికీ ఓటర్ల జాబితాలో మరికొన్ని చేర్పులు ఉండొచ్చు. ఆతరువాత చివరి ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ప్రధాన పార్టీల అభ్యర్థులను ప్రకటించడంతో ఇప్పటినుంచే ఆయా పార్టీల శ్రేణులు అందుబాటులో ఉన్న ఓటర్ల జాబితాలో ఎవరికి ఎక్కువెక్కువ అనుకూలంగా ఉంటుంది, ఎక్కడెక్కడ ప్రతికూలంగా ఉంటుందనే కోణంలో పోస్టుమార్టం చేసుకుంటున్నారు. నామినేషన్ల ప్రక్రియ కన్నా ముందుగానే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేక వర్గంతో విలక్షణంగా సాగుతున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అడుగులు ఎటు అనే విషయంపై కూడా జనాల్లో చర్చ జరుగుతోంది. మొత్తంమీద జరుగుతున్న పరిణామాలను ఓటర్లు నిశితంగా గమనిస్తున్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



సాయిబాబా విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

యద్దనపూడి(మార్టూరు), మార్చి 25: యద్దనపూడి గ్రామంలో సోమవారం సాయిబాబా దేవాలయం ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. దేవాలయంలో సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా దేవాలయం వద్ద హోమాలు, యాగం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన మాజీ డీజీపీ గిరీష్ కుమార్ విచ్చేశారు. మధ్యాహ్నం దేవాలయ కమిటీ వారు భారీగా భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

కొండయ్యకు పలువురు మద్దతు



కొండయ్యకు మద్దతు తెలుపుతున్న మాజీ కౌన్సిలర్ పండ్లూరి ప్రమీలమ్మ, ఆనందరావు

చీరాల, మార్చి 25: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్యకు రోజురోజుకు మద్దతు ఇచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కొండయ్యను మున్సిపల్ 28వ వార్డు మాజీ కౌన్సిలర్ పండ్లూరి ప్రమీలమ్మ, ఆనందరావు కలిసి తమ మద్దతు తెలిపారు. వేటపాలెం మండలం రామాపురంకు చెందిన పలువురు మత్స్యకారులు వాయిల పెరుమాళ్ ఆధ్వర్యంలో కొండయ్యను కలిసి మద్దతు తెలిపారు. వారి మెడలో కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాల మహా నాడు రాష్ట్ర కన్వీనర్ పీతా మాణిక్యరావు తదితరులు కొండయ్యను కలిసి మద్దతు తెలిపారు.

చీరాల మండలం ఈపురుపాలెం పద్మనాభునిపేట శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి, వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మాజీ ఐఏఎస్ గుడ్డంటి చంద్రమౌళితో కలిసి కొండయ్య పాల్గొన్నారు. స్థానిక చేనేత పెద్దలు, నాయకులు, భక్తులతో మాట్లాడారు. వేటపాలెం మండల బీసీ సెల్ అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వర్లు పుల్లరిపాలెం మాజీ సర్పంచ్ ఆకోటి అంకిరెడ్డి కొండయ్యను కలిసి మద్దతు తెలిపి పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం!



ఆత్మహత్య పాల్పడిన వారి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న చీరాల నియోజకవర్గ చేనేత ప్రతినిధులు

చీరాల, మార్చి 25: కడప జిల్లా ఒంటిమిట్టలో వైసీపీ నేతల ఆగడాలతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కుటుంబసభ్యులను సోమవారం చీరాల నియోజకవర్గానికి చెందిన చేనేత జనసమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మాచర్ల మోహనరావు, టీడీపీ నాయకులు సజ్జా వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధైర్యపడొద్దు, అండగా ఉంటామని భరోసా కల్పించారు. మృతిచెందిన ఒక్కొక్కరికి రూ.50లక్షలు చొప్పున కుటుంబసభ్యులకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుత్తి శివయ్య, దేవరకొండ నాగేశ్వరరావు, వావిలాల దాశరధి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

చినగంజాం, మార్చి 25: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగుచూసింది. చినగంజాం ప్రాంతంలోని రొంపేరు కాలువపైగల రైల్వేబ్రిడ్జి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి సుమారు వారం రోజుల క్రితం ఆత్మహత్య చేసుకొని మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుని జేబులో ఉన్న ఫోను నెంబర్ల ఆధారంగా అతని ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. చినగంజాం రైల్వేస్టేషన్ స్టేషన్‌మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పెదగంజాం రెవెన్యూ అధికారి కొమ్మి మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

ఒంగోలు ఎంపీగా మాగుంట పోటీ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25 : ఒంగోలు లోక్‌సభ ఎన్నికల్లో తన తండ్రి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పోటీ చేస్తారని యువ పారిశ్రామికవేత్త, మాగుంట తనయుడు రాఘవరెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. తన తండ్రి ఒంగోలు ఎంపీగా ఉండటం వల్ల రాష్ట్ర అభివృద్ధి దృష్టిలో పెట్టుకొని కేంద్రం నుంచి నిధులు రాబట్టడంతోపాటు కేంద్ర పథకాలు రాష్ట్రంలో సమర్థవంతంగా నిర్వహిస్తారనే అభిప్రాయంతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. ఈ పర్యాయం ఒంగోలు పార్లమెంట్‌కు శ్రీనివాసులరెడ్డి పోటీ చేయాల్సి ఉందని మంచి ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయం తెలియజేసినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అందువల్ల టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల శ్రేణులు, ప్రజలు, మాగుంట అభిమానులు మా తండ్రి శ్రీనివాసులరెడ్డి విజయానికి కృషిచేయాలని కోరారు.

ట్రాన్స్‌జండర్ ఆత్మహత్య

ఒంగోలుక్రైం,మార్చి25: ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్యకు పాల్పడింది. ఒంగోలు చెందిన ఉమ్మిడిశెట్టి స్వాతి(27) ప్రస్తుతం స్థానిక సత్యనారాయణపురంలో అద్దె ఇంటిలో నివాసం ఉంటూ ఆదివారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వివరాలలోకి వెళితే స్వాతి ఒంగోలులో నివాసం ఉండి జీవనం సాగిస్తున్నది. అమెకు ఓ ప్రియుడు ఉన్నాడు. వారిమధ్య మనస్పర్థల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మార్టూరులో వైసీపీ కోటకు బీటలు

- ముస్లిం మైనారిటీ నేతలతో పాటు
- వార్డు మెంబర్లు టీడీపీలో చేరిక



ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన మార్టూరు వైసీపీ నేతలు

మార్టూరు, మార్చి 25: మార్టూరులో అధికార పార్టీ కోటకు బీటలు పడుతున్నాయి. కొంతమంది వైసీపీ నాయకులు టీడీపీ గూటికి చేరుతున్నారు. సీనియర్ నాయకుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీగా తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం ఉదయం మండలంలోని ఇసుక దర్శిలో గల క్యాంపు కార్యాలయంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. వైసీపీ నేత కాకోలు వెంకటేశ్వర్లుతో పాటు మండల ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు గన్నవరం ఖుదే, మార్టూరు పంచాయతీ మూడవ వార్డు మెంబరు నండూరి కుమారి, నాల్గవ వార్డు మెంబరు చండేలు ఖాజావలి, 13వ వార్డు మెంబరు పెన్నుబోయిన భాగ్యలక్ష్మి, సీనియర్ నాయకుడు అట్లూరి బాబూరావు, రామిశెట్టి వెంకటేశ్వర్లు అనుచరులతో పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలను మెడలో వేసి స్వాగతించారు. 4నెలల క్రితం వైసీపీకి చెందిన 11 వార్డు మెంబరు జన్నెగుంటి శ్రీనివాసరావు టీడీపీలో చేరారు.



ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేత కాకోలు వెంకటేశ్వర్లు

ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రం కోలుకోవాలన్నా, రాష్ట్ర ప్రజానీకం భవిష్యత్తు బాగుపడాలన్నా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావలసిన అవసరం ఏర్పడిందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా కృషిచేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిని, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని చంద్రబాబుపై నమ్మకంతో పార్టీలో చేరిన వైసీపీ నాయకులను ఆయన అభినందించారు. ఒక ఛాన్స్ అంటూ ప్రజలను మోసం చేసిన జగన్ ప్రభుత్వానికి వీడ్కోలు పలకడానికి సైనికుల్లాగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, షేక్ రఫిక్, కామినేని జనార్దన్, తెండెపు ఆదినారాయణ, జాష్టి సాంబశివరావు, కమ్మ శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జొన్నతాళి ఉపసర్పంచ్ చేరిక

జొన్నతాళి ఉపసర్పంచ్, వైసీపీ నేత ఆవుల కోటిరెడ్డి అనుచరులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన పలువురు బీసీ నాయకులు పార్టీలో చేరారు. వారందరికీ ఏలూరి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో శివరాత్రి శ్రీను, శానంపూడి చైతన్య, బంగారు బాబు, తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలులో ఉన్నా వైసీపీ నేతల హడావుడి

- శింగరకొండలో సామాన్య భక్తులకు చుక్కలు
- పార్టీ రంగులతో ఉన్న ట్యాంకర్‌తో అన్నదాన సత్రాలకు నీటి సరఫరా



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న వైసీపీ అద్దంకి, చీరాల అభ్యర్థులు హనిమిరెడ్డి, వెంకటేష్

అద్దంకి, మార్చి 25: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69వ వార్షిక తిరునాళ్ల సోమవారంతో ముగిసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ ప్రభల ఏర్పాటు బాగా తగ్గటంతో భక్తుల రద్దీ కూడా తక్కువగా ఉంది. ఇక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వైసీపీ నేతలు మాత్రం హడావుడి చేశారు. వైసీపీ రంగులతో ఉన్న ట్యాంకర్‌తో అన్నదాన సత్రాలకు నీరు సరఫరా చేయటం విమర్శలకు తావిస్తుంది. అదేసమయంలో వైసీపీ అద్దంకి, చీరాల అభ్యర్థులు పాణెం హనిమిరెడ్డి, కరణం వెంకటేష్‌లు మంది మార్బలంతో దేవాలయంలో పూజలకు హాజరు కావటంతో సాధారణ భక్తులకు మరింత ఇబ్బంది కలిగింది. నాయకుల సేవలతో తరించిన దేవాలయ సిబ్బంది, పోలీసులు సాధారణ భక్తుల వాహనాలను ఎంద సమయంలో ప్రధాన నామ్ రోడ్డు వద్దనే నిలిపివేశారు. దీంతో దేవాలయ వద్దకు వెళ్లే భక్తులు ఎండవేడిమికి ఇబ్బంది పడ్డారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తుల రద్దీ ఒకింత ఉండగా, అనంతరం క్యూలైన్‌తో పాటు దేవాలయ పరిసరాలు సైతం ఖాళీగా దర్శనమిచ్చాయి. తిరునాళ్లలో ఒకేఒక్క విద్యుత్ ప్రభ ఏర్పాటుచేయటంతో రాత్రి సమయంలో కూడా భక్తుల రద్దీ తక్కువగా ఉంది.

సమన్వయంతో పనిచేద్దాం.. వైసీపీని గద్దె దింపుదాం

- జనసేన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి



ఎమ్మెల్యే సాంబశివరావు, విజయకుమార్‌ను సన్మానిస్తున్న జనసైనికులు

పర్చూరు, మార్చి 25: సమన్వయంతో పనిచేసి రానున్న ఎన్నికల్లో అహంకార, నియంతృత్వ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక కొల్లావారి కల్యాణ మండపంలో నిర్వహించిన జనసేన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తు చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసం, అరాచకం తప్ప అభివృద్ధి మచ్చుకైనా కానరాలేదన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయకుమార్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ పిలుపుమేరకు ఏలూరి సాంబశివరావు విజయంలో జనసైనికులు కలిసి కట్టుగా పనిచేసి అత్యధిక మెజార్టీని తీసుకురావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి, విజయ కుమార్‌ను జనసైనికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కారంపూడి సందీప్ తేజ, కఠారి సురేంద్రబాబు, దీర్ఘాల రమేష్, ఒగ్గిశెట్టి నరసింహం, తులసి చంటి, రంగిశెట్టి అంజనేయులు, శీలం కుమార్, కందా సురేంద్ర, లగడపాటి నాగరాజు, లగడపాటి శంకర్, నారిశెట్టి మల్లి, దాసరి సాంబయ్య, పెంజంద్ర రమణ, రంగిశెట్టి సింగయ్య, పసుపులేటి రవి, సుదాకర్, తులసి నాగు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణం



ఉంగుటూరు స్వామివార్ల కల్యాణం

ఉప్పుటూరు(పర్చూరు), మార్చి 25: పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీగంగా పార్వతీ సమేత అమరలేశ్వర స్వామి, భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు చేశారు. కల్యాణ వేడుకల అనంతరం సోమవారం స్వామివార్లను నందివాహనంతో ప్రత్యేక వాహనంలో భక్తుల దర్శనార్థం రథోత్సవం నిర్వహించారు. స్వామివారి వేడుకలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి తిరుమలశెట్టి శిరీష ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అర్చక స్వాములు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసల పర్వం



పర్చూరులో టీడీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, మార్చి 25: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీలో వలసల పర్వం జోరందుకుంది. రోజురోజుకు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున చేరుతున్నారు. ఏలూరి సాంబశివరావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పర్చూరు, చినగంజాం, మార్టూరు, కారంచేడు మండలాల పరిధిలో వివిధ సామాజిక వర్గాల నుంచి భారీగా చేరికల పర్వం కొనసాగుతుంది. సోమవారం కారంచేడు మండలం ఆదిపూడికి చెందిన వైసీపీ నాయకులు పోల గోపయ్య, దరరావులపల్లి నాగరాజు, పారిచర్ల కుమార్, ఓలేటి సుబ్బారావు, వరికూటి బాబు, వరిశెట్టి కోటేశ్వరరావు, జంతాల సుబ్బారావు, పారి రమేష్‌తోపాటు దాదాపు 50 కుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు.

అలాగే, పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన వైసీపీ నాయకులు దున్నా సుబ్బారావు, తమ్ముటూరి చిట్టిబాబు, దున్నా మరియదాసు, నేహేమియా, మురికిపూడి ఆశోక్, దున్నా శ్యామ్యూల్, ప్రేమ్‌కుమార్, మహేష్, కట్టెంపూడి గోపీచంద్, ఉన్నా చిన్నా అభ్యయ్యలు పార్టీలో చేరారు. పర్చూరులోని 16వ వార్డులోని వైసీపీకి చెందిన పలు కుటుంబాలు కొల్లా శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు.

కార్యక్రమంలో టీడీపీ పర్చూరు మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణ, కొల్లా శివరాం ప్రసాద్, కొండ్రగుంట శివనాగేశ్వరరావు, తులసి శ్రీనివాసరావు, తంగిళ్ల మల్లికార్జునరావు, దుళ్లిపల్లి వెంకటస్వామి, మామిడిపాక హరిప్రసాద్, కొండ్రగుంటి సుబ్బారావు, ఆకుల మధుబాబు, మల్లాది సురేష్, చెరుకూరి చినవయ్య, కావ బుల్లోడు, మక్కెన శేఖర్‌బాబు, కంచేటి శ్రీహరి, షేక్ బషీర్, పఠాన్ సమీర్, తదితరులు పాల్గొన్నారు.

కూనం కుటుంబమంతా వైసీపీ సభ్యులే!

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 25 : విశాఖలో పట్టుబడిన కొకైన్ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్న కూనం పూర్ణ చంద్రరావు వైసీపీ సీనియర్ నాయకుడిగా ఉండగా, ఆయన కుటుంబమంతా వైసీపీ వ్యవస్థాపక సభ్యులే అని సంతనూతలపాడు టీడీపీ అభ్యర్థి బీఎన్ విజయ్ కుమార్ అన్నారు. సోమవారం సంతనూతలపాడు నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీని జగన్ రెడ్డి హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ మొదటి స్థానంలో ఉంటే జగన్ రెడ్డి హయాంలో డ్రగ్స్ రవాణాలో నెం.1 స్థానానికి చేర్చారని విమర్శించారు. వీరభద్రరావు సోదరుడు కూనం పూర్ణచంద్రరావు ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం వైసీపీ సీనియర్ నేత అని, ఇతనికి విజయసాయి రెడ్డితో సంబంధం ఉన్నాయని అన్నారు.

విశాఖలో పట్టుబడిన కంటైనర్‌లో వివిధ రకాల మత్తు పదార్థాలు ఉన్నాయని సీబీఐ తన నివేదికలో పేర్కొందన్నారు. గతంలో విజయవాడలోని ఆశీ ట్రేడర్స్ పేరుతో ముంద్రా పోర్టులో రూ. 21 వేల కోట్లు విలువైన హెరాయిన్ దిగుమతితో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి కీలకంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇపుడు ఏకంగా డ్రై ఈస్ట్‌తో కలిపి రూ. 50 వేల కోట్ల విలువైన 25వేల కిలోల మార్ఫిన్, కొకైన్, హెరాయిన్, యాంఫెటమిన్ వంటి మత్తు పదార్థాలు దొరకాయన్నారు. బ్రెజిల్ నుంచి మత్తు పదార్థాలు దిగుమతి చేస్తున్నారని తెలిసే జగన్ రెడ్డి తన అధికారులను పంపారా ? అని ప్రశ్నించారు. కల్తీ మద్యం, మాఫియాతో ఇప్పటికే ప్రజలు ఇళ్లు, ఒళ్లు గుల్ల, ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపీలో ఉన్నాయని ఆయన విమర్శించారు. వైసీపీ చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు టీడీపీపై నిందలు వేయడం దుర్మార్గమన్నారు. మీడియా సమావేశంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ ఆదిక కొండ స్వాములు, మండల పార్టీ అధ్యక్షులు కోటా నరేష్‌నాయుడు, గొర్రెపాటి సుబ్బారావు, సెక్రటరీ కాకర్ల లక్ష్మీ ప్రసాద్, రావుల సుబ్బారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కుంకాల గోపి, అట్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాం, మార్చి 25: మండలంలోని సోపిరాల గ్రామంలో వేంచేసియున్న హరిహర సుత అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి జయంతిని పురస్కరించుకొని స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు సన్మానం

చినగంజాం, మార్చి 25: స్థానిక బాలకోటేశ్వరస్వామి స్పోర్ట్సు క్లబ్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడాకారులను సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల బీహార్‌లో జరిగిన 33వ అంతర్జాతీయ సబ్‌జూనియర్ జాతీయ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ జట్టు 3వ స్థానంలో నిలిచింది. జట్టులో చినగంజాం ప్రాంతానికి చెందిన ఆరు అభిషేక్‌రెడ్డి, బోగిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఆట్ల ఆశోక్‌రెడ్డిలకు, ఉదయం ఆంధ్ర యంగ్ టాలెంటెడ్ క్రీడాకారుడిగా ఎంపికై రూ.10 లక్షల అవార్డు అందుకున్న బాలకృష్ణారెడ్డికి స్పోర్ట్సు క్లబ్ అధ్యక్షుడు, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఎం.గిరిబాబు, సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బోగిరెడ్డి నాగాంజనేయరెడ్డి, కోశాధికారి దేవా సుబ్బారెడ్డి, బీశవరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి రాత అలవర్చుకోవాలి

ఇంకొల్లు, మార్చి 25: విద్యార్థులు చదువుతో పాటు మంచి రాత అలవర్చుకోవాలని పీజీటర్ అకాడమీ ఆఫ్ హ్యాండ్ రైటింగు ఒంగోలు శిక్షకులు మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని గంగవరంలో బాలల విద్యా వైజ్ఞానిక వేదిక ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా తెలుగులో మంచి రాతపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వేదిక కన్వీనర్ ఆత్కూరిని సుబ్బారావు, కరి కమలేశ్వరరావు, ప్రధానోపాధ్యాయిని నార్నె సమత, తెలుగుపండిట్ రాధ, రైతుసంఘం నాయకులు కంచిమర్ల రామకోటేశ్వరరావు, రాంబాబు, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు గొర్రెపాడులో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ముస్తాబు చేసిన ప్రాంగణం

బల్లికురవ, మార్చి 25: మండలంలోని గొర్రెపాడులో ఏర్పాటుచేస్తున్న అభయాంజనేయ స్వామి విగ్రహ పతిష్ఠ బుధవారం ఉదయం 8.14 గంటలకు జరగనుంది. యాగశాలను ఏర్పాటుచేసి పూజలు ప్రారంభించారు. అభయాంజనేయ స్వామి పక్కనే బాల వీరాంజనేయస్వామి, వినాయక స్వామి విగ్రహాలను కూడా ప్రతిష్ఠించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్రామంలో సోమవారం ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది.

ఉత్సాహంగా హోలీ వేడుకలు

బల్లికురవ, మార్చి 25: మండలంలోని పలు గ్రామాలలో సోమవారం హోలీ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీలు క్వారీలలో ఉత్తర రాష్ట్రాలకు చెందిన కార్మికులు రంగులు చల్లుకుంటూ పండుగ సంబరాలలో మునిగి తేలారు. కొందరు కార్మికులు తమ సొంత గ్రామాలకు తరలివెళ్లారు. గ్రామాలలో చిన్నారులు, యువత రంగులలో మునిగి తేలారు. ఈసందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే, సోమవారం లక్ష్మీ జయంతి, పౌర్ణమి కావడంతో ప్రజలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఎంపీ సురేష్ కాన్వాయ్‌తో భక్తులకు ఇక్కట్లు

అద్దంకి, మార్చి 25: బాపట్ల ఎంపీ సురేష్ కాన్వాయ్‌తో సోమవారం రాత్రి శింగరకొండ తిరునాళ్లకు రావడంతో రాత్రి 9.30 గంటల సమయంలో భక్తులు ఇబ్బంది పడ్డారు. రాత్రి 9 గంటల వరకు భక్తుల సందడి పెద్దగా లేకపోగా, 9 గంటల సమయం నుంచి భక్తుల రాక ప్రారంభమైంది. అదేసమయంలో ఎంపీ కాన్వాయ్ తిరునాళ్లలోకి రావటంతో భక్తులు ఎక్కడికక్కడ నిలిచిపోయారు. దీంతో మహిళలు, వృద్ధులు మరింత ఇబ్బంది పడ్డారు.

అన్నపూర్ణాదేవి మందిరం ప్రారంభం

అద్దంకి, మార్చి 25: శింగరకొండ వాసవికన్యకాపరమేశ్వరి అన్నదాన సత్రంలో కాశీ అన్నపూర్ణాదేవి మందిరాన్ని సోమవారం ప్రారంభించారు. దాతలు గార్లపాటి శ్రీనివాసరావు, రాధారాణి సహకారంతో అన్నపూర్ణాదేవి మందిరం నిర్మాణం చేశారు. సత్రం అధ్యక్షుడు శ్రీరాం నాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు బోజనపల్లి సత్యనారాయణ, బాస్కర్ సప్లయర్స్ ఆదినేశ్, టీడీపీ నాయకుడు గార్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ

ఒంగోలు (కల్చరల్), మార్చి 25: పౌర్ణమి సందర్భంగా సోమవారం నిర్వహించిన గిరి ప్రదక్షిణ అత్యంత ఘనంగా జరిగింది. స్థానిక జయరాం హాలు దగ్గర ఉన్న గోశాల వద్ద ముందుగా పూజలు నిర్వహించి అనంతరం కోర్టు సెంటర్, కేశవస్వామి పేట, శర్మ కాలేజ్, గద్దలగుంట, కొణిజేడు బస్టాండు, రాజాపానగల్ రోడ్డు మీదుగా శ్రీగిరికి భక్తులు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారు అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి భక్తులు గోవింద నామ స్మరణ చేశారు. ఆదివిధంగా మహిళల ప్రదర్శించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో గిరిప్రదక్షిణ కమిటీ నిర్వాహకులు బొమ్మిరెడ్డి రాఘవ రెడ్డి, చిలకపాటి రంగారావు, రాధారమణ గుప్తా జయప్రద పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్థానిక కేశవస్వామిపేట శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీలక్ష్మీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దంపతులు పెద్దసంఖ్యలో పాల్గొని వ్రతాలను ఆచరించారు. ఆలయ అర్చకులు రమణాచార్యులు, కె.వి.ఎల్.శర్మ‌చారి, నాగారాజు దేవ్‌లు ముందుగా విష్వక్సేన పూజ, కలశారాధన, రమా సమేత సహిత సత్యనారాయణ స్వామివారికి పంచామృతాభిషేకం మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత జవాబు పత్రాల మూల్యాంకనం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 25: ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల రెండో విడత మూల్యాంకనం మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్ఐవో సైమన్‌విక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత మూల్యాంకనం ముందుగా ఈనెల 28వతేదీ నుంచి నిర్వహించాల్సి ఉండగా రెండు రోజులు ముందుగానే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బాటని, జువాలజీ, కామర్స్ పేపర్ల వ్యాల్యుయేషన్ జరుగుతుందని తెలిపారు. మూల్యాంకనానికి నియమితులైన లెక్చరర్లు మంగళవారం ఉదయం స్థానిక ఏకేవీకే జూనియర్ కాలేజీలో హాజరుకావాలన్నారు. రిలీవింగ్ ప్రిన్సిపాళ్లందరూ వారి కాలేజీలోని బాటని, జువాలజీ, కామర్స్ అధ్యాపకులను స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రానికి పంపించాలని కోరారు.

పకడ్బందీగా ఓపెన్ స్కూలు పరీక్షలు

ఒంగోలు(విద్య), మార్చి 24 : జిల్లాలో జరుగుతున్న ఏపీ ఓపెన్ స్కూలు పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో పరీక్షల నిర్వహణ కోసం 18 స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేస్తున్నామన్నారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన ఐదుగురు 25 ప్రకారం వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓపెన్ స్కూలు పరీక్షల కో ఆర్డినేటర్ ఎస్‌కే అల్తాఫ్ అలీ, ఎం. శ్రీనివాసరావులు కంభం, బేస్తవారిపేట, రాచర్ల, పొదిలిలోని ఓపెన్ స్కూలు సెంటర్లను తనిఖీ చేశారు. ఇది ఎలాంటి అవకతవకలు జరగకుండా నిర్వహించాలని డీఈవో సుభద్ర తెలిపారు.

శాస్త్రోక్తంగా గోమాత అంత్యక్రియలు

ఒంగోలు (కల్చరల్), మార్చి 25:స్థానిక శ్రీనగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని గోశాలలో గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న గిరి జాతి గోవు మృతి చెందింది. దీంతో గోవు ఖనన కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ఆలూరి వెంకట రమణారావు గో సంరక్షణ దేవస్థానంలో గోశాలను ఏర్పాటుచేసి ప్రత్యేకంగా గిరిజాతి ఆవులను తెప్పించారు. అందులో ఒకటి సోమవారం మృతిచెందింది. ఆవు కళేబరానికి పసుపు, కుంకుమలు రాసి పూజ చేసి శాస్త్రోక్తంగా ఖననం చేశారు. నిర్వహించారు.